ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
ఆదివారం 15 సెప్టెంబరు 2024







అసైన్డ్ ఆక్రోశం

అమరావతి కౌలు ఎగవేతపై ఆగ్రహం

- నాట్ ట్యాలీడ్ జాబితాలో రాజధాని అసైన్డ్ రైతులు
- గత ప్రభుత్వ కుట్రలు ఇంకా కొనసాగుతున్నాయని ఆరోపణ
- పాలకులు మారినా పాత పద్ధతిలోనే సీఆర్డీఏ ఉందని ఆవేదన

గుంటూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి కోసం భూసమీకరణ కింద 28 వేల మంది రైతులు 34 వేల ఎకరాల భూములిచ్చారు. వారిలో 3 వేల మంది అసైన్డ్ రైతులు ఉన్నారు. వీరు 2,600 ఎకరాల భూములను అమరావతికి ఇచ్చారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం ఫారం- 9.14 ప్రకారం ఏడేళ్ల పాటు పట్టా ప్యాకేజీ ఇచ్చింది. కురగల్లు- నీరుకొండ రెవెన్యూ గ్రామాల పరిధిలోని 300 మంది రైతులు అమరావతి కోసం 458 ఎకరాల భూములు ఇచ్చారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం 9.14 అగ్రిమెంటు ప్రకారం ఏడేళ్లపాటు భూ యజమానులైన రైతులకు కౌలు చెల్లించింది. మిగిలిన రైతులకు మాదిరిగానే అసైన్డ్ రైతులకు కూడా రిటర్నబుల్ ప్లాట్లు కూడా ఇచ్చారు. కాగా వైసీపీ ప్రభుత్వం భూముల విషయంలో అక్రమాలు జరిగాయన్న వంకతో అసైన్డ్ రైతుల భూములపై 2021లో సీఐడీ విచారణకు ఆదేశించింది. దీనిని అడ్డం పెట్టుకుని కౌలు రైతులకు ఇవ్వాల్సిన కౌలును సీఆర్డీఏ ఆపేసింది. దాదాపు మూడేళ్ల పాటు ఎలాంటి విచారణ చేయకుండా నాట్ ట్యాలీడ్ అంటూ వంక పెట్టి వారికి మూడేళ్లుగా కౌలు ఆపేసింది. తాజాగా ఎన్నికలకు ముందు విచారణ పూర్తయిందని కొంతమంది భూములు ఇంకా నాట్ ట్యాలీడ్ కిందే ఉన్నాయని సీఆర్డీఏ అధికారులు చెప్తున్నారు.

ప్రభుత్వం మారినా తీరని కష్టాలు

సీఐడీ విచారణ పేరుతో వైసీపీ ప్రభుత్వం ఇబ్బందులు పెట్టడమే కాకుండా కౌలు అందక రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. వైసీపీ ప్రభుత్వం పోతే కానీ తమ కష్టాలు తీరవని రైతులు రోడ్డెక్కారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తమ కష్టాలు తీరిపోతాయని అసైన్డ్ రైతులు భావించారు. తమ భూములపై గత ప్రభుత్వం కుట్ర పూరితంగా వేసిన సీఐడీ విచారణ తొలగిపోయి, తమకు కౌలు వస్తుందని ఆశగా ఎదురుచూశారు. కూటమి ప్రభుత్వంలో తమ కష్టాల గురించి చెప్పుకునేందుకు సీఆర్డీఏ, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ అసైన్డ్ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు. కాగా శుక్రవారం కురగల్లు వెళ్లిన డిప్యూటీ కలెక్టర్ ప్రస్తుతం 458 మందిలో 227 మందికి మాత్రమే కౌలు వస్తుందని, 230 మందికి కౌలు రాదని చెప్పడంతో వారు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఇలా జరగడంతో తమ ఆవేదన అరణ్య రోదనగా మారిందని వారు కలవరం చెందుతున్నారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయం చేయాలని కోరుకుంటున్నారు. గత ప్రభుత్వ కక్ష సాధింపు చర్యల కారణంగా కనీసం పిల్లలకు ఫీజులు కూడా కట్టుకోలేని స్థితిలో ఉన్నామని, అప్పులపాలై అల్లాడిపోతున్నామని వారు కన్నీటి పర్యంతమవుతున్నారు.

'అందరిలాగే మేము కూడా రాజధానికి భూములిచ్చాం. కానీ మాకే ఎందుకు కౌలు ఇవ్వడం లేదు? మాకే ఎందుకు ఇలా జరుగుతోంది. మేమేం పాపం చేశాం. మేమూ మిగిలిన వారిలాగే రాజధానిలో ఉన్నాం. జీవనాధారమైన భూములు అమరావతికి ఇచ్చి జీవనానికి ఇబ్బంది పడుతున్నాం. గత వైసీపీ ప్రభుత్వం కక్షతో మమ్మల్ని వేధించింది. కౌలు ఇవ్వకుండా బాధించింది. కానీ ఇప్పుడు మా దగ్గర భూములు తీసుకున్న పాత ప్రభు త్వమే అధికారంలోకి వచ్చింది. అయినా మాకు ఈ కష్టాలేంటి? వారు చేసిన కుట్రలు మేము కోరుకున్న ప్రభుత్వంలోనూ కొనసాగడమేమిటి? కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా మాకు న్యాయం జరగక పోతే ఇంకెవరికి చెప్పుకోవాలి?

- అమరావతి అసైన్డ్ రైతుల ఆక్రోశమిది.

దయ చూపండి



మా కష్టాలు పగవాడికి కూడా వద్దు. ఉన్న కొద్దిపాటి భూమిని ప్రభుత్వానికి ఇచ్చి ఇప్పుడు కష్టాలు పడుతున్నాం. మూడేళ్లుగా చేతిలో చిల్లి గవ్వ లేక, వేరే పని చేయలేక నరక యాతన అనుభవిస్తున్నాం. ఇప్పటికైనా మాపై దయ చూపండి.

- జొన్నలగడ్డ విష్ణువర్ధనరావు

సీఆర్డీయే తీరు మారాలి



కూటమి ప్రభుత్వం వచ్చినా పెద్దగా మార్పేమీ కనిపించడం లేదు. వైసీపీ ప్రభుత్వంలో మాదిరిగానే సీఆర్డీఏ అధికారులు వ్యవహరిస్తున్నారు. కమిషనర్, కలెక్టర్ అధికారుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదు. తక్షణం ప్రభుత్వం దీనిపై చర్యలు తీసుకోవాలి. మాకు న్యాయం చేయాలి.

- మాదల సురేంద్ర

అప్పులు పాలయ్యాం



మూడేళ్లుగా కౌలు రాకపోవడంతో చాలా మందిమి అప్పుల పాలయ్యాం. చాలామందికి తిండికి కూడా ఇబ్బందిగా ఉంది. చదువుకునే పిల్లలకు ఫీజులు కట్టలేక అనేక మంది ఇబ్బంది పడుతున్నారు. ఇదే కొనసాగితే పిల్లల చదువులు అర్థాంతరంగా ఆగిపోతాయి. ఆ పాపం ప్రభుత్వానిదే అవుతుంది.

- ఎం. విజయభాస్కర్

ఎందుకు ఇంత కక్ష



రాజధాని కోసం భూములివ్వడమే నేరమా? మా మీద ఎందుకు ఇంత కక్ష సాధిస్తున్నారు. మూడేళ్లుగా కౌలు డబ్బులు రాకపోవడంతో అప్పులపాలై అగచాట్లు పడుతున్నాం.

- మాదాల సాంబశివరావు

కొనసాగుతున్న కుట్రలు



గత వైసీపీ ప్రభుత్వం కుట్రలు, కుతంత్రాలతో వేధించింది. ఈ ప్రభుత్వం వస్తే మా కష్టాలు పోతాయనుకున్నాం. కానీ అలాంటివేమీ జరగలేదు. వైసీపీ ప్రభుత్వం చేసిన కుట్రలు ఇంకా కొనసాగుతున్నాయి. ఇక మాకు న్యాయం ఎలా జరుగుతుంది?

- ముప్పవరపు రామకృష్ణ

పంచాయతీలకు.. గ్రేడ్లు



రావిపాడు పంచాయతీ కార్యాలయం


కార్యదర్శులు ఇలా..	
గ్రేడ్ ఒకటి	200
గ్రేడ్ రెండు	48
గ్రేడ్ మూడు	184
గ్రేడ్ నాలుగు	150
గ్రేడ్ ఐదు	427
గ్రేడ్ ఐదులో చెక్ పవర్	287

- జనాభా, ఆదాయం ఆధారంగా విభజన
- ఇక గ్రామాల్లో ప్రజలకు చేరువుగా అధికారులు
- గ్రేడ్ల ఆధారంగానే కార్యదర్శుల బదిలీలకు ఆదేశాలు
- ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో ప్రక్రియకు శ్రీకారం
- గ్రేడ్ల ప్రకటనతో ఎమ్మెల్యేల సిఫార్సు లేఖల వేటలో కార్యదర్శులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గ్రామాల్లో గతంలో పంచాయతీ కార్యదర్శి దర్శనం గగనం. విద్యార్థుల నుంచి రైతుల వరకు ఇలా ప్రతీఒక్కరికి కూడా కార్యదర్శితో పని ఉంటుంది. అయితే అలాంటి కార్యదర్శి అందుబాటులో ఉండేవారు కాదు. అత్యవసరంగా సర్టిఫికెట్లు అవసరమైతే ఇక వారి ఇబ్బందులు వర్ణనాతీతం. దీనికంతటికీ క్లస్టర్ విధానమే కారణం. ఈ పరిస్థితుల్లో పంచాయతీల పాలనలో మార్పునకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పంచాయతీ అధికారులు ప్రజలకు చేరువుగా ఉండేలా నూతన విధానాన్ని రూపొందించింది. క్లస్టర్ విధానానికి స్వస్తి పలికింది. గత ప్రభుత్వంలో రెండు మూడు పంచాయతీలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి గ్రామ కార్యదర్శులను నియమించారు. అయితే కొత్త విధానంలో ప్రతి పంచాయతీకి ఒక గ్రేడ్ కేటాయించింది. గ్రేడ్లు ఆధారంగా ప్రతి పంచాయతీకి ఒక కార్యదర్శిని నియమించనున్నది. గ్రామ పంచాయతీ జనాభా, ఆదాయాన్ని అనుసరించి పంచాయతీలకు గ్రేడ్లు కేటాయించారు. ఐదు గ్రేడ్లుగా పంచాయతీలను విభజించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1061 పంచాయతీలు ఉండగా కార్యదర్శులు 1009 మంది ఉన్నారు. 52 మంది కార్యదర్శుల కొరత ఉంది. గ్రేడ్ రెండు, 4 కార్యదర్శులు తక్కువగా ఉన్నారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి ఉత్తర్వుల మేరకు గ్రేడ్లు కేటాయింపు జరిగింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని పంచాయతీల్లో 2011 జనాభా, గత మూడేళ్ల ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని గ్రేడ్లు కేటాయించారు. గతంలో లక్ష ఆదాయం లోపు ఉన్న పంచాయతీలను రెండు నుంచి నాలుగు పంచాయతీలను కలిపి ఒక క్లస్టర్‌గా నిర్ణయించి కార్యదర్శిని నియమించేవారు. రెండు దశాబ్దాల క్రితం ఉన్న ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రేడ్లు గతంలో కేటాయించారు. దీంతో కార్యదర్శి అందుబాటులో లేక ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ప్రతీ గ్రామంలోనూ కార్యదర్శి ప్రజలకు అందుబాటులో



ఉండేలా గ్రేడ్ల విధానాన్ని రూపొందించారు. ప్రతి పంచాయతీకి ప్రత్యేకంగా ఒక్కొక్క కార్యదర్శిని నియమించనున్నారు. ప్రస్తుతం పంచాయతీల ఆదాయంతో పాటు జనాభా కూడా పెరిగింది. దీంతో అధిక శాతం పంచాయతీల గ్రేడ్లు మారాయి. మున్సిపాలిటీల సమీపంలోని పలు పంచాయతీలలో వివిధ రూపాల్లో ఆదాయ వనరులు కూడా పెరిగాయి. ఇటువంటి పంచాయతీలు గ్రేడ్ ఒకటి జాబితాలో చేరాయి.

కార్యదర్శులకు స్థానచలనం..

గ్రేడ్ల వారీగా పంచాయతీ కార్యదర్శుల నియామకాల్లో కూడా వ్యత్యాసాలు ఉన్నాయి. కొందరు పని భారం తగ్గించుకునేందుకు తక్కువ గ్రేడ్ పంచాయతీల్లో విధులు నిర్వహించడం, మరికొందరు తక్కువ గ్రేడ్ కార్యదర్శులు ఎక్కువ గ్రేడ్ పంచాయతీల్లో పనిచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ కమిషనర్ జారీ చేసిన నూతన నిబంధనల మేరకు జనాభా, తలసరి ఆదాయాలకు అనుగుణంగా పలు పంచాయతీల గ్రేడ్లు మారాయి. ఈ నేపథ్యంలో కార్యదర్శులకు కూడా స్థానచలనం కలగనున్నది. ఆదాయాలకు అనుగుణంగా పంచాయతీలలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కూడా అర్హులైన పంచాయతీ కార్యదర్శులను గ్రేడ్ల వారీగా నియమించనున్నారు. పంచాయతీ గ్రేడ్లు ప్రకారం కార్యదర్శులను ఈ నెల 23 లోపు బదిలీ చేయనున్నారు. ఇందుకు సంబంధించి పంచాయతీరాజ్ శాఖ ఉమ్మడి గుంటూరు జిల్లా యూనిట్‌గా కార్యదర్శుల బదిలీలకు రంగం సిద్ధం చేస్తున్నది. బదిలీల్లో భాగంగా కార్యదర్శుల గ్రేడ్ల ఆధారంగా పంచాయతీలకు నియమించనున్నారు. దీంతో కొందరు కార్యదర్శులు కంగుతిన్నారు. ఇప్పటికే పంచాయతీలను ఎంపిక చేసుకుని సిఫార్సు లేఖలు పొందిన వారిలో గందరగోళం నెలకొంది. మళ్లీ వారి గ్రేడు ఆధారంగా పంచాయతీలను ఎంపిక చేసుకుని తిరిగి ఎమ్మెల్యే సిఫార్సు లేఖలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. 23 కల్లా బదిలీలు పూర్తి చేయాల్సి ఉండగా ఎమ్మెల్యేల వద్ద సిఫార్సు లేఖలు కోసం కార్యదర్శులు క్యూ కడుతున్నారు. గ్రేడు ఆధారంగానే కార్యదర్శులను పంచాయతీలకు నియ మించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ కూడా ఉత్తర్వులు జారీ చేసింది. గ్రేడ్లలో వ్యత్యాసం ఉంటే జీతాల విడుదలలో సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయి.

దీంతో పంచాయతీలు, కార్యదర్శుల గ్రేడ్లను తాజాగా ప్రకటించారు. వీరం దరినీ ఆయా గ్రేడ్లకు అనుగుణంగా పంచాయతీలకు నియమిం చేందుకు అధికారులు చర్యలు చేపడు తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించిన వివరాలను పంచాయతీరాజ్ కమిషనర్‌కు జిల్లా అధికారులు పంపారు. ఆయా గ్రామ పంచాయతీల జనాభా, వరుసగా మూడేళ్ల తలసరి ఆదాయ వివరాలను కూడా అందులో పొందుపరిచారు.

నూనెలు.. సలసల



- ఒక్క రోజులోనే కొండెక్కిన ధర
- పామాయిల్ రూ.20, సన్‌ఫ్లవర్ రూ.25 పెంపు
- వ్యాపారుల వద్ద ఉన్న నిల్వలు బ్లాక్ మార్కెట్‌కు..

గుంటూరు(విద్య), సెప్టెంబరు 14: వంటనూనెలు.. సలసల కాగుతున్నాయి. మంటపెడితేనే కాదు.. కొనుగోలు చేయాలన్నా సలసలమంటున్నాయి. ఒక్క రోజులోనే రూ.25 వరకు ధర పెరిగింది. మార్కెట్‌లో వంట నూనెల ధరలు అమాంతం పెరిగిపోయాయి. శనివారం ఒక్కరోజులోనే కిలోకు రూ.20నుంచి రూ.25కు ధర పెరిగింది. దీంతో వంటనూనెల్ని వ్యాపారులు బ్లాక్ మార్కెట్‌కు తరలించేశారని సమాచారం. ధరలు అమాంతం పెరిగిపోవడంతో వినియోగదారులు విలవిల్లాడుతున్నారు. ఇతర దేశాల నుంచి చౌకగా వంటనూనెలు దిగుమతి అవుతున్నాయి. దీంతో దేశంలో నూనెగింజల ధరలు పడిపోతున్నాయి. ఈ క్రమంలో స్థానికంగా రైతులకు ప్రయోజనం చేకూర్చాలనే లక్ష్యంతో వంటనూనెలపై కేంద్రం దిగుమతి సుంకం పెంచాలని యోచిస్తోంది. ఇప్పటివరకు ముడి పామాయిల్, సోయాబీన్, సన్‌ఫ్లవర్ తదితర వంటనూనెలపై ఎటువంటి దిగుమతి సుంకం లేదు. తాజాగా ఆయా వంటనూనెలపై 20శాతం దిగుమతి సుంకాన్ని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. రిఫైన్డ్ పామాయిల్, సోయా, సన్‌ఫ్లవర్ నూనెలపై 32.5శాతం దిగుమతి సుంకం పెంచారు. దీనికి అదనంగా అగ్నిసెస్ కూడా చేరనున్నది. పన్నులు భారీగా పెరగనున్న నేపథ్యంలో దిగుమతులు భారీగా తగ్గనున్నాయి. ఈ పరిస్థితుల్లో వ్యాపారులు ధరలు భారీగా పెంచి విక్రయిస్తున్నారు. వారం క్రితం పామాయిల్ ప్యాకెట్ ధర రూ.94 ఉండగా, శనివారం రూ.16 పెరిగి ధర రూ.115కు చేరింది. సన్‌ఫ్లవర్ ధర వారం క్రితం రూ.113 ఉండగా ప్రస్తుతం రూ.125 నుంచి రూ.130 మధ్య విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా గణేష్ నిమజ్జనాల సందర్భంగా భారీ స్థాయిలో అన్నప్రసా ద వితరణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. మరికొద్దిరోజుల్లో దసరా, దీపావళి తదితర పండుగలు రానున్నాయి. దీంతో మరింతగా ధరలు పెరిగే అవకాశం ఉందని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఉల్లిపాయ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రస్తుతం నూనెల ధరలు కూడా ఆమాంతం పెరగడంతో మధ్య తరగతి, సామాన్య కుటుంబాల బడ్జెట్ తలకిందులైంది. ముగ్గురు ఉన్న కుటుంబంలో నెలకు సగ టున మూడు ప్యాకెట్లు పామాయిల్ లేదా సన్‌ఫ్లవర్ ఆయిల్ వినియోగిస్తారు. అంటే ఒక కుటుంబంపై వంటనూనెల ధరల ప్రభావం రూ.100వరకు పడుతోంది. మరోవైపు ఉల్లి ఎగు మతులపై ఉన్న నిషేధం ఎత్తివేయడంతో దాని ధరలు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. నెలక్రితం కిలో ఉల్లి రూ.30లోపు ఉండగా నేడు రూ.60కి చేరింది. రైతుబజార్లలోనే కిలో ఉల్లి రూ.55కు విక్రయిస్తున్నారు. ప్రముఖ మాల్స్‌లో వంటనూనెల ధరల్లో మార్పు లేకపోవడంతో వినియోగదారులు పోటెత్తారు. దీంతో గుంటూరులోని కొన్ని మాల్స్‌లో శనివారం సాయంత్రం నుంచి వాటి విక్రయాలు నిలిపివేశారనితెలిసింది.

పంట నష్టంపై కొనసాగుతున్న సర్వే

గుంటూరు సిటీ, సెప్టెంబరు 14: జిల్లాలో వరదప్రాంతాల్లో పంటనష్టం సర్వే చురుగ్గా సాగుతోంది. ఈ నెల 18 నాటికి పంటనష్టం అంచనాలను రూపొందించాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో శనివారం సెలవురోజు అయినా వ్యవసా య, రెవెన్యూసిబ్బంది సర్వే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలో 45వేల ఎకరాల్లో పంటనష్టం జరిగి ఉండవచ్చని అధికారులు అంచనా వేశారు. ఈ క్రమంలో 37వేల ఎకరాల్లో పంటనష్టం జరినట్లు శనివారం సాయంత్రానికి యాప్‌లో నమోదుచేశారు. సర్వే ఇంకా జరుగుతున్నందున బాధిత రైతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. మొత్తం 166 గ్రామాల్లో వరదనష్టం సమాచార సేకరణ జరుగుతోంది. ఈ నెల 17వ తేదీకి ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది. అయితే యాప్‌లో వస్తున్న సాంకేతిక సమస్యలు సిబ్బందికి తలనొప్పిగా మారాయి. నష్టపోయిన రైతులకు ప్రభుత్వ పరిహారం త్వరితగతిన అందేలా సర్వే ప్రక్రియను సిబ్బంది చురుగ్గా చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు.

నేటి నుంచి ఇసుక సరఫరా

- తుపానుకు ముందు బుకింగ్స్‌కు అవకాశం
- తాళ్లాయపాలెం స్టాక్‌యార్డులో 23 వరకు లోడింగ్

గుంటూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని తుళ్లూరు మండలంలోని తాళ్లాయపాలెం, లింగాయపాలెం స్టాక్‌యార్డులలో ఇసుక కోసం వినియోగదారులు చేసుకున్న బుకింగ్స్‌ని క్లియర్ చేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. గత నెల 30, 31, ఈ నెల 1, 2, 3, 4, 5 తేదీల్లో తుళ్లూరు మండలంతో పాటు ఇతర మండలాల ప్రజలు ఉచిత ఇసుక కోసం బుకింగ్ చేసుకున్నారు. అయితే తుపాను, కృష్ణానదికి వరద కారణంగా స్టాక్‌యార్డుల్లో ఇసుక లోడింగ్‌లను అధికారులు నిలిపేశారు. ఇప్పుడు నదిలో వరద సాధారణ స్థితికి రావడంతో స్టాక్‌యార్డు వద్ద ఇసుక లోడింగ్ చేసేందుకు అనువైన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేప థ్యంలో వినియోగదారులు చేసుకున్న బుకింగ్స్ ఆధారంగా వారికి ఇసుక లోడింగ్ చేసే తేదీలను అధి కారులు ప్రకటించారు. గతంలో లింగాయపాలెం స్టాక్‌యార్డులో ఇసుక బుకింగ్ చేసు కున్న వారికి తాజాగా తాళ్లాయపాలెం యార్డుని కేటాయించారు. గతంలో ఆగస్టు 30న లింగాయపాలెం స్టాక్ యార్డులో 360 మంది ఇసుక కోసం బుకింగ్ చేసుకున్నారు. వారు ఈ నెల 15 ఆదివారం ఇసుక తీసుకెళ్లొచ్చు. అలానే తాళ్లాయపాలెంలో గత నెల 30న బుకింగ్ చేసుకున్న వారికి ఈ నెల 16న, గత నెల 31న లింగాయ పాలెం స్టాక్‌యార్డు ఇసుక కోసం బుకింగ్ చేసుకున్న వారికి ఈ నెల 17న ఇసుక లోడింగ్ చేస్తారు. గత నెల 31న ఇసుక బుకింగ్ చేసుకున్న వారికి ఈ నెల 18న, ఈ నెల 1న బుకింగ్ చేసుకున్న వారికి 20న, 2న బుకింగ్ చేసుకున్న వారికి 21 తేదీ, 3న బుకింగ్ చేసుకున్న వారికి ఈ నెల 22, ఈ నెల 4, 5 తేదీల్లో బుకింగ్ చేసుకున్న వారికి ఈ నెల 23న ఇసుక లోడింగ్ చేస్తారు. తొమ్మిది రోజుల వ్యవధిలో పెండింగ్ బుకింగ్స్ అన్నీ క్లియర్ చేస్తామని అధికారులు తెలిపారు. దాదాపుగా 3,051 లారీల ఇసుకని తాళ్లాయ పాలెం స్టాక్‌యార్డు నుంచి లోడింగ్ చేస్తామని చెప్పారు.



సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.10 లక్షల విరాళం


సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న మధుసూదనరావు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 14: ఇటీవల సంభవించిన వరదల్లో నష్టపోయిన బాధితుల సహాయార్థం ప్రముఖ ఆడిటర్ చుండూరి మధుసూదనరావు రూ.10 లక్షల విరాళం ప్రకటించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో సీఎం నారా చంద్రబాబు నాయుడుకు అందజేశారు. వరద బాధితుల్ని సహృదయంతో ఆదుకునేందుకు ముందుకు వచ్చిన ఆడిటర్ మధుసూదనరావును సీఎం అభినందించారు.

కోటిన్నర భూమి.. రూ.9 లక్షలకే విక్రయం

- దీనిపై జడ్పీ సీరియస్
- జీవోకి వ్యతిరేకంగా తీర్మానం చేయాలని నిర్ణయం?

గుంటూరు సిటీ, సెప్టెంబరు 14: పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు భూమి వ్యవహారంలో జిల్లా పరిషత్ పాలకవర్గం సీరియస్‌గా ఉంది. ఈ విషయమై మాట్లాడేందుకు జిల్లా పరిషత్‌లోని అనుభవజ్ఞులైన అధికారులను శనివారం గుంటూరుకు పిలిపించినట్లు తెలిసింది. తుమ్మలచెరువు చెట్టు సమీపంలో జిల్లా పరిషత్‌కు చెందిన 2.71 ఎకరాల భూమిని టోల్ ప్లాజా నిర్వహిస్తున్న నామ్ ఎక్స్‌ప్రెస్ వే కు అతి తక్కువ ధరకు కట్టబెట్టారు. అద్దంకి- నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కనే ఈ భూమి ఉంది. వాస్తవానికి అక్కడ ఎకరం భూమి విలువ రూ.60 లక్షల నుంచి రూ. 70 లక్షల వరకు ఉంది. మొత్తం భూమి విలువ సుమారు రూ. కోటిన్నర వరకు ఉంటుంది. 2022లో ఈ భూమిని టోల్‌ప్లాజాకు కేటాయించే ప్రక్రియ మొదలైయింది. 2023లో ఈ వ్యవహారంపై జిల్లా పరిషత్ పాలకవర్గం అభ్యంతరం కూడా వ్యక్తం చేసింది. అయినా అప్పటి జిల్లా ఉన్నతాధికారి అత్యుత్సాహం ప్రదర్శించి ప్రైవేటు సంస్థకు లబ్ధి చేకూరేలా నిర్ణయం తీసుకున్నారన్న ఆరోపణలు వచ్చాయి. అంత విలువైన భూమిని రూ.9 లక్షలకే టోల్‌ప్లాజాకు కేటాయిస్తూ జీవో 215 వెలువడింది. ప్రస్తుతం ఈ మొత్తం వ్యవహారంలో జడ్పీ పాలకవర్గం పార్టీలకు అతీతంగా స్పందించింది. జడ్పీ ఆదాయానికి భారీగా గండి కొట్టే జీవోను రద్దు కోరుతూ తీర్మానం చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. రానున్న సమావేశంలోనే ఈ తీర్మానం ప్రవేశపెట్టాలన్న ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. అంతేకాకుండా ముందస్తుగా ఏమేమీ చర్యలు తీసుకోవచ్చు అన్న దానిపై కూడా జడ్పీలోని సీనియర్ అధికారులతో సమాలోచన జరుపుతున్నారు.

చోరీ కేసులో ఆర్నెల్లు జైలు శిక్ష

బాపట్ల, సెప్టెంబరు 14: చినగంజాం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కడవకుదురు హైస్కూల్‌లో జరిగిన కంప్యూటర్‌ల చోరీ కేసులో నిందితుడికి చీరాల కోర్టు న్యాయమూర్తి జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ సందర్భంగా శనివారం బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 2016లో చినగంజాం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కడవకుదురు జడ్పీ హైస్కూల్‌లో చోరీ జరిగింది. అప్పటి ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దర్యాప్తులో నరసరావుపేటకు చెందిన బిట్టు హేమకుమార్ చోరీకి పాల్పడ్డాడని నిర్ధారించుకొని అతనిని అరెస్టు చేసి చోరీ చేసిన కంప్యూటర్‌లను రికవరీ చేశారు. పీపీ పద్మజరెడ్డి వాదనలు వినిపించి ముద్దాయిపై నేరాన్ని తగిన సాక్ష్యాధారాలతో రుజువు చేశారు. దీంతో నిందితుడు హేమ్‌కుమార్‌కు ఆర్నెల్లు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి షేక్ రెహాన తీర్పు చెప్పారు.

అంబటి మురళివి అక్రమ నిర్మాణాలు

- వాటికి ఎలాంటి అనుమతుల్లేవు
- ప్లాన్ ఒకలాగా.. నిర్మాణం మరోలాగా..
- కుమ్మక్కైన వైసీపీ నాయకులు, కార్పొరేషన్ అధికారులు
- పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఆరోపణ



గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 14 : పొన్నూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన అంబటి మురళి ఆధ్వర్యంలో గుంటూరు నగరం నడిబొడ్డున నిర్మాణం జరుగుతున్న గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్ ఎటువంటి అనుమతుల్లేవని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆరోపించారు. శనివారం గుంటూరులోని తన కార్యాలయంలో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ శాఖల నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా, ఎన్‌వోసీ లేకుండానే అడ్డగోలుగా భారీ నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. ఈ నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయని, మున్సిపల్ అధికారులతో కుమ్మక్కై అంబటి మురళి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఈ గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్ ప్లాన్ ఒకలాగా, నిర్మాణం మరోలాగా చేపట్టి లబ్ధిదారులను మోసగిస్తున్నారని ఆరోపించారు. బజరంగ్ జూట్ మిల్ స్థలంలో హై రైజ్‌డ్ బిల్డింగ్ నిర్మాణం చేపట్టారన్నారు. వాస్తవానికి వైసీపీ ప్రభుత్వంలో జూట్ మిల్ కార్మికులకు న్యాయం చేయకుండానే, కోల్‌కత్తాకు చెందిన ఒక వ్యక్తిని బెదిరించి ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారన్నారు. 2015లో రెండు సెల్లార్‌లు, ఐదు ఫ్లోర్‌ల కోసం అనుమతి తీసుకున్నారని అన్నారు. 2017లో 15 ఫ్లోర్‌లకి అనుమతి అడిగారని, ఇప్పటి వరకూ వాటికి ఎలాంటి అనుమతులు రాలేదని వివరించారు. ఈ వెంచర్ వెనుక పక్కన రెల్వే ట్రాక్ ఉందనీ, రైల్వే పట్టాల నుంచి 75 అడుగుల దూరం వదిలి పెట్టాలని రెల్వే శాఖ ఎన్‌వోసీ ఇచ్చిందని, కానీ ఎన్‌వోసీకి భిన్నంగా ఇక్కడ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపించారు. సరైన అనుమతులు లేకుండా ప్రభుత్వాన్ని, కార్పొరేషన్ అధికారులను మోసం చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఫైర్, ఎన్విరాన్మెంటల్, ఎయిర్ ట్రాఫిక్ ఎన్వోసీ, మైనింగ్ సెస్, ఇన్సూరెన్సు ఏ ఒక్కటీ ఈ భవన నిర్మాణానికి లేవన్నారు. సుమారు ఐదు వందల మందికి పైగా వినియోగదారులను మోసం చేశారని అన్నారు.

ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తాం..

రైల్వే అనుమతి కోసం ఒక ప్లాన్, కార్పొరేషన్ అనుమతి కోసం మరో ప్లాన్ ఇచ్చారని, ఇన్ని లోపాలున్నా నిర్మాణానికి సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి ఆయన డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే చట్టపరమైన చర్యల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామన్నారు.

కార్మికులకు నష్టపరిహారం చెల్లించలేదు..

బజరంగ్ జూట్ మిల్‌లో పని చేస్తున్న కార్మికులకు లాకౌట్ సందర్భంగా చెల్లించాల్సిన నష్టపరిహారం ఇప్పటి వరకు అందించలేదని నరేంద్ర ఆరోపించారు. కార్మికుల స్థలంలో గత ప్రభుత్వంలో అప్పుడు మంత్రి అంబటి రాంబాబు కొంత కొనుగోలు చేశాడని, ఇప్పుడు మిగతా స్థలంలో అంబటి మురళి అడ్డగోలుకు నిర్మాణాలు చేపడుతున్నారని ఆయన తెలిపారు.

ఎక్సైజ్ శాఖ విభజనతో నష్టం


సీఎం చంద్రబాబు, మంత్రి రవీంద్ర చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎక్సైజ్ డీసీ బాబ్జిరావు, అసోసియేషన్ నాయకులు

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 14: గత ప్రభుత్వం రాష్ట్రంలో ఎక్సైజ్ శాఖను రెండుగా విభజించడం వలన నష్టం జరిగిందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ అధికారుల సంఘం అధ్యక్షుడు, గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.వి. వి.ఎన్.బాబ్జిరావు తెలిపారు. ఎక్సైజ్ శాఖను గతంలో మాదిరిగానే ఏకీకృతంగా ఉంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో శనివారం గుంటూరు ఎక్సైజ్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎక్సైజ్ శాఖ మంత్రి కె. రవీంద్ర చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డీసీ బాబ్జిరావు మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖను రెండుగా విభజించి గత ప్రభుత్వ పెద్దలు వారి ప్రయోజనాలను పెంపొందించుకున్నారన్నారు. నేరాల నియంత్రణ కష్టమైందని తెలిపారు. దీంతో రాష్ట్రంలో గంజాయి పెరిగిపోయిందనీ, యువత మత్తుకు అలవాటు పడ్డారని అన్నారు. ఈ విధానం సరైంది కాదని గత ప్రభుత్వ పెద్దలకు పలుమార్లు విజ్ఞప్తి చేసిన పట్టించుకోలేదన్నారు. దీంతో రాష్ట్రంలో ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తమ సమస్యలను విని ఎస్ఈబీ శాఖను రద్దు చేసిందని అన్నారు. దీనికి కృతజ్ఞతగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి రవీంద్ర చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎక్సైజ్ శాఖ కానిస్టేబుల్స్ అండ్ హెడ్‌కానిస్టేబుల్స్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మార్పు కోటయ్య, కార్యదర్శి రాజు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి రూ. 6.05 కోట్లతో ప్రతిపాదనలు

- ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



రెంటచింతల, సెప్టెంబరు 14: భారీ వర్షాలు కురిసినప్పుడల్లా కొత్తపాలువాయి, పాత పాలువాయి గ్రామాల మధ్యనున్న పిల్లి వాగు పొంగడం, జన జీవనం స్తంభించిపోతున్న తరుణంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ. 6.05 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసినట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. శనివారం రెంటచింతలలో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వాగు 50 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పులో ఉందని పేర్కొన్నారు. 5 కానాలను 10 మీటర్ల వెడల్పులో ఏర్పాటు చేసి వరదనీరు సాఫీగా వెళ్లేలా అధికారులు డిజైన్ రూపొందించారన్నారు. అలాగే మంచికల్లు అడ్డరోడ్డు నుంచి గ్రామంలోకి 3 కి.మీ 300 మీటర్లుందని, నూతన రహదారి నిర్మాణం నిమిత్తం రూ.2 కోట్ల 35 లక్షలతో తయారు చేసిన అంచనాలు ఇంజనీర్ ఇన్ చీఫ్ పరిశీలనలో ఉన్నాయన్నారు. డిసెంబరులో నిర్వహించే మంచికల్లు తిరునాళ్ల కల్లా రహదారి నిర్మాణం పూర్తవుతుందన్నారు. రూ. 1.18 కోట్లతో మండలంలో చేపట్టాల్సిన మరమ్మతు పనులు సాంకేతిక కారణాలతో ఒక వారం ఆలస్యం కానున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు ఎలాంటి ఆంక్షలు విధించొద్దని పోలీసులను కోరామని చెప్పారు. పండగలు, పెళ్లి కార్యక్రమాలను ప్రశాంతంగా జరుపుకోవచ్చని, వాటి మీద ఆంక్షలు విధించి మా పార్టీ అనుమతి తీసుకోవాలనే నీచ స్థాయికి తాము దిగజారలేదని ప్రతిపక్ష పార్టీ నేతలనుద్దేశించి వ్యంగ్యంగా అన్నారు. పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అరుదైన గుండె శస్త్రచికిత్స


రోగి శశికాంత్‌తో వైద్యులు కుప్పుస్వామి, రామరాజు

గుంటూరు (మెడికల్) సెప్టెంబరు 14: గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో అరుదైన గుండె శస్త్రచికిత్స జరిపి యువకుడి ప్రాణాలు కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. అవనిగడ్డ మండలం కోడూరుకు చెందిన శశికాంత్ (25) అనే యువకుడు రెండు నెలలుగా తీవ్రమైన చలిజ్వరంతో బాధ పడుతూ పలు ఆసుపత్రులకు వెళ్లినా జ్వరం తగ్గలేదు. అతడికి పదేళ్ల కిందట హృదయ స్పందన బాగా తగ్గిపోవడంతో కృత్రిమంగా గుండె కొట్టుకొనే వేగం పెంచేందుకు పేస్‌మేకర్ అనే బ్యాటరీతో నడిచే పరికరం అమర్చారు. ఈ నేపథ్యంలో బాధితుడు గత నెలలో గుంటూరు జీజీహెచ్ కార్డియాలజీ ఓపీకి వచ్చాడు. పేస్‌మేకర్‌లో వైర్ ఇన్‌ఫెక్షన్‌కు గురికావడంతో జ్వరం వస్తోందని, ఆ వైర్‌ను తొలగించాలని వైద్యులు నిర్ణయించారు. బైపాస్ సర్జరీ చేసి మెషిన్‌లో ఉన్న తీగ వంటి లీడ్‌ను వైద్యులు తొలగించారు. ఈ లీడ్ వల్ల గుండె కవాటాలు దెబ్బతిన్నట్లు గుర్తించిన డాక్టర్లు, వెంటనే గుండె కవాటాలకు కూడా సర్జరీ చేసి వాటిని సరి చేశారు. దీంతో శశికాంత్ గుండె పని తీరు సాధారణ స్థితికి రావడంతోపాటు ఆరోగ్యం కుదుట పడింది. శస్త్రచికిత్స చేసిన వైద్య బృందంలో డాక్టర్ హరికృష్ణమూర్తి, డాక్టర్ కుప్పుస్వామి, డాక్టర్ ఎన్‌వీ రామరాజు, డాక్టర్ ప్రమోద తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో నాయకత్వ లక్షణాలు


క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మంగళగిరి, సెప్టెంబరు 14: క్రీడల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, విద్యార్థులు క్రీడల్లో రాణించి భారతదేశాన్ని విశ్వ గురువుగా నిలిపే ప్రయత్నం చేయాలని విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర ఉపాధ్యక్షుడు ఆచార్య జి.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. విద్యా భారతి అఖిల భారత శిక్షా సంస్థాన్‌కి సంబంధించి దక్షిణ మధ్య క్షేత్ర క్రీడల పోటీలు రెండు రోజులపాటు జరగనున్నాయి. ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి 700 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. నూతక్కి విజ్ఞాన విహార పాఠశాల, తాడేపల్లి కేఎల్ యూనివర్సిటీ వేదికగా ఈ పోటీలు శని, ఆదివారాల్లో జరుగుతున్నాయి. జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రెసిడెంట్ ఎంవీ చారి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యం ఇస్తూ భవిష్యత్తులో క్రీడారంగంలో మన దేశ కీర్తి పతాకాన్ని ఎగురవేయాలని సూచించారు. అండర్-14, 17, 19 బాలబాలికల విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని, విజేతలు నవంబరు నెలలో అఖిల భారత స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికవుతారని క్షేత్ర ఖేల్ కూద్ సంయోజక్ కేఆర్‌కే సత్యనారాయణ తెలియజేశారు. కార్యక్రమంలో విద్యా భారతి దక్షిణమధ్య క్షేత్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎల్.సుధాకర్‌రెడ్డి, సీబీఆర్ ప్రసాద్, డాక్టర్ వెంకటరావు, రవితేజ, జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

18న జిల్లా ఫుట్‌బాల్, జూడో ఎంపికలు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 14: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఫుట్‌బాల్, జూడో ఎంపికలు ఈ నెల 18న నిర్వహిస్తామని పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 ఫుట్‌బాల్ బాలుర, బాలికల ఎంపిక డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియం నరసరావుపేటలో నిర్వహిస్తామన్నారు. అండర్-14, 17 బాలుర, బాలికల జూడో ఎంపికలు చిలక లూరిపేట ఏఎంజీ హైస్కూల్‌లో నిర్వహిస్తామన్నారు. ఎంపికకు హాజరు అయ్యేవారు ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికేట్, బర్త్ సర్టిఫికేట్‌లతో ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలని వివరించారు.

అర్జున అవార్డు రావడం గర్వకారణం

మాచర్లటౌన్, సెప్టెంబరు 14: భారత బ్లైండ్ క్రికెట్ కెప్టెన్ ఇల్లూరి అజయ్ కుమార్‌రెడ్డిని శనివారం మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. వెల్దుర్తిలోని తన నివాసంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డిని అజయ్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. 2016 నుంచి 2024 వరకు భారత బ్లైండ్ క్రికెట్ కెప్టెన్‌గా వ్యవహరించిన అజయ్ కుమార్‌రెడ్డి ఐదు ప్రపంచ కప్‌లను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్జున అవార్డు మాచర్లకు చెందిన అజయ్ కుమార్‌రెడ్డికి రావడం గర్వకారణమని అన్నారు.

పోక్సో చట్టం కింద మూడు కేసులు నమోదు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 14: బాలికలపై అసభ్యకరంగా ప్రవర్తించిన ముగ్గురిపై మంగళగిరి పట్టణ, రూరల్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశారు. మంగళగిరి అర్బన్ సీఐ డి.వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని రత్నాలచెరువుకు చెందిన వ్యవసాయం చేసుకునే గుంటూరు వెంకటేశ్వరరావు (50) స్థానికంగా ఏడో తరగతి చదువుతున్న బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. అలాగే వడ్లపూడి సెంటరు సమీపంలోని గాజుల వారి వీధికి చెందిన వడ్రంగి పని చేసుకునే చింతక్రింది వెంకటేశ్వరరావు (61) స్థానికంగా యూకేజీ చదువుతున్న ఐదేళ్ల బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలికల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఇద్దరి నిందితులపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసినట్టు సీఐ వినోద్‌కుమార్ తెలిపారు. నిడమర్రు గ్రామంలోని జగనన్న కాలనీకి చెందిన రిషింగి ప్రభుదాస్ అనే వ్యక్తి ఆత్మకూరు గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలికను ప్రేమ పేరుతో వంచించి బలవంతంగా అపహరించుకుపోయాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ తెలిపారు. నిందితుడు ప్రభుదాస్‌పై గతంలో అక్రమ మద్యం, గంజాయి కేసులు ఉన్నట్టు చెప్పారు.

గంజాయి విక్రేతల అరెస్టు


వివరాలు చెబుతున్న డీఎస్పీ జనార్దనరావు, సీఐ రమేష్‌బాబు, ఎస్సై ప్రకాష్‌రావు

తెనాలి, మారీసుపేట, సెప్టెంబరు 14: పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తును అరెస్టు చేసినట్లు డీఎస్పీ బి.జనార్దనరావు తెలిపారు. శనివారం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్వాధీనం చేసుకున్న గంజాయిని, నిందితుల వివరాలను వెల్లడించారు. శుక్రవారం రాత్రి ఆర్ఆర్ నగర్ కాలనీ, చినపరిమిపోయే డొంకలోని శ్రీకృష్ణ స్కూల్ వెనుక వైపు ఉన్న ఖాళీ స్థలంలో పిచ్చి చెట్ల వద్ద గంజాయి విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేర సీఐ రమేష్‌బాబు తన సిబ్బందితో దాడి చేసి ఐదుగురిలో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు పారిపోయారు. ముగ్గురు రావుత్ సల్మాన్, మునిపల్లి సుబ్బారావు, కోళ్ల మహేష్‌లను విచారించామన్నారు. వారు చెడు వ్యసనాలకు, జల్సాలకు అలవాడు పడి ఒక ముఠాగా ఏర్పడి అరకులో గుర్తుతెలియని వ్యక్తి నుంచి 1.5 కేజీల గంజాయిని రూ.30 వేలకు కొనుగోలు చేసి వాటిని తెనాలిలో చిన్న, చిన్న ప్యాకెట్‌లుగా విక్రయిస్తున్నారని తెలిపారు. వీరివద్ద నుంచి 1.2 కేజీ గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు. నిందితులను పట్టుకున్న సీఐ రమేష్‌బాబు, ఎస్సై ప్రకాష్‌రావు, పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

బస్సులో లక్ష విలువైన గంజాయి స్వాధీనం

దాచేపల్లి, సెప్టెంబరు 14: ప్రయాణికుని నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు దాచేపల్లి సీఐ గుత్తి వెంకట్రావు తెలిపారు. శనివారం సీఐ మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి గుంటూరు వైపు ప్రయాణం చేస్తున్న బస్సును సాధారణ తనిఖీలో భాగంగా దాచేపల్లి ఎస్ఐ తనిఖీ చేశారు. బస్సులో హైదరాబాద్ నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న ప్రయాణికుడు పోమాలపాటి షారున్ కుమార్ నుంచి కేజీ 700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీని విలువ రూ.లక్ష ఉంటుందని చెప్పారు. దాచేపల్లి ఎస్ఐ శివనాగరాజు పాల్గొన్నారు.

పంచాయతీ నిర్లక్ష్యానికి యువకుడు బలి

చెరుకుపల్లి, సెప్టెంబరు 14: పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం యువకుని జీవితాన్ని బలి తీసుకుంది. చెరుకుపల్లి ఎస్ఐ కథనం ప్రకారం చెరుకుపల్లి కస్తూరివారిపేటకు చెందిన ఎన్నూరు సాయిమణికంఠ(22) శనివారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు డంపింగ్‌యార్డు పక్కనే ఉన్న శ్మశానవాటికను దాటి చెరువు వద్దకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా శ్మశాన వాటికలో అభివృద్ధి పనుల నిమిత్తం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ తగిలి కుప్పకూలిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే అక్కడకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిరసనకారులతో మాట్లాడారు. తీగలు సరి చేయాలని చెప్పినా, పట్టించుకోని ఉద్యోగిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుని తండ్రి బాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. మృతునికి కూలి పనులు చేసుకునే తల్లిదండ్రులు, చదువుకుంటున్న చెల్లి ఉంది.

సర్వీసు తీగలకు అనుమతి లేదు..

శ్మశాన వాటిక అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన సర్వీసు తీగలకు అనుమతి లేదని విద్యుత్ శాఖ ఏఈ భాషా చెప్పారు. అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్నారని, తీగలు ఏర్పాటు చేసిన వారిపై చర్యలకు సిఫార్సు చేసినట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	128, 138,148
చికెన్ విత్ స్కిన్	240.00
చికెన్ స్కిన్ లెస్	250.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



విద్యార్థినికి డిగ్రీ పట్టా అందజేస్తున్న ఆచార్య సాంబశివరావు,డాక్టర్ టీవీ నారాయణ తదితరులు

ప్రజారోగ్య సంరక్షణలో ఫార్మానిపుణల పాత్ర కీలకం

● మంగళయాతాన్ వర్సిటీ విసి ఆచార్య కేఆర్ఎస్ సాంబశివరావు

● ఘనంగా చిప్స్‌లో స్నాతకోత్సవం

గుంటూరు(విద్య),సెప్టెంబరు 14: ప్రజారోగ్య సంరక్షణలో ఫార్మశీ నిపుణులు కీలక పాత్ర పోషిస్తున్నారని,పరిశోధనలతో మరింత నైపుణ్యం పెంచుకోవాలని మంగళయాతాన్ యూనివర్శిటీ (జబల్‌పూర్) వీసీ ఆచార్య కేఆర్ఎస్ సాంబశివరావు అన్నారు. శనివారం చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో (చిప్స్) నిర్వహించిన స్నాతకోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఫార్మా రంగం ప్రపంచంలోనే అగ్రస్థాయిలో ఉందని, ఈ నేపథ్యంలో నిపుణులు మరింత నైపుణ్యంతో ముందుకుసాగాలని సూచించారు. యువతకు ఫార్మరంగంలో అనేక అవకాశాలు ఉన్నాయని ప్రజారోగ్య సంరక్షణే ధ్యేయంగా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఇండియన్ ఫార్మా అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ టీవీ నారాయణ మాట్లాడుతూ ఫార్మా నిపుణులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఉత్తమ ఫార్మసిస్టుగా రాణించాలన్నారు. డిగ్రీలు తీసుకున్న విద్యార్థుల అసలు జీవితంలోకి అడుగుపెడుతున్నారని, అవరోధాలను సమర్థవంతంగా అధిగమించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి చుక్కపల్లి రమేష్, ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర, ఆర్వీఆర్ బీఈడీ కళాశాల కార్యదర్శి గద్దె మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సుమేధాలో హిందీ భాషా దినోత్సవం

గుంటూరు(విద్య),సెప్టెంబరు 14: స్థానిక ఎన్జీవోకాలనీలోని సుమేధా స్కూల్‌లో హిందీ భాషా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ మన జాతీయ భాష హిందీ, దేశంలో మాట్లాడే భాషల్లో మొదటి స్థానంలో, ప్రపంచ స్థాయిలో మూడో స్థానంలో ఉందని తెలిపారు. విద్యార్థులు హిందీ భాష ప్రాముఖ్యత తెలుసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి మాతృభాషతోపాటు హిందీ నేర్చుకోవాలని సూచించారు.



అన్న సంతర్పణను ప్రారంభిస్తున్న తులసీ ధర్మచరణ్ తదితరులు

అన్నదానం మహాపుణ్యకార్యం

● వేద సీడ్స్ ఈడీ తులసి ధర్మచరణ్

గుంటూరు, సెప్టెంబరు 14: పేదలకు, నిరాశ్రయులకు అన్నదానం చేయడం మహాపుణ్యకార్యమని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ అన్నారు. స్థానిక గుజ్జనగుండ్లలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద శ్రీ గణేష్ మిత్ర మండలి ఆధ్వర్యంలో గణపతి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా నైవేద్యం సమర్పించి, వేద పండితుల నుంచి ఆశీర్వచనం స్వీకరించిన అనంతరం అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా తులసి ధర్మచరణ్ మాట్లాడుతూ అన్ని దానాల్లో కన్నా అన్నదానం చాలా గొప్పదని అన్నారు. తొలి ఏడాది శ్రీ గణేష్ మిత్రమండలి ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు ఆకాశమే హద్దుగా నిర్వహించామని, నేడు ఏడు వేల మందికి అన్నదానం చేయడం, ఇందుకు కుల, మత, వర్గ బేధాలు లేకుండా ప్రతి ఒక్కరు భాగస్వామ్యులై కార్యక్రమాన్ని విజయవంతం చేయడం శుభపరిణామన్నారు. ఈ ఆధునిక కాలంలో భగవన్నామస్మరణ మనశ్శాంతిని ఇస్తుందన్నారు.



మురళీకృష్ణయాదవ్ దంపతులను సత్కరిస్తున్న ఎస్ఈ విజయ్‌కుమార్, ఈఈలు, ఇతర అధికారులు

విద్యుత్‌శాఖలో మురళీ కృష్ణయాదవ్ సేవలు స్ఫూర్తిదాయకం

● ఇంజనీరింగ్ అసోసియేషన్

గుంటూరు, సెప్టెంబరు 14: విద్యుత్ శాఖలో ఏఈ నుంచి చీఫ్ జనరల్ మేనేజర్ స్థాయి వరకు వివిధ హోదాల్లో ఆవుల మురళీకృష్ణయాదవ్ అందించిన సేవలు స్ఫూర్తిదాయకమైనవని ఏపీసీపీడీసీఎల్ గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ డాక్టర్ ప్రత్తిపాటి విజయ్‌కుమార్ అభినందించారు. సీజీఎమ్‌గా ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన మురళీకృష్ణయాదవ్ దంపతులను శనివారం స్థానిక జీటీ రోడ్డులోని ఏ 1 కన్వెన్షన్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వారిని శాలువా, గజమాలతో విద్యుత్ అధికారుల సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్‌శాఖలో అజాతశత్రువుగా ఉంటూ ఎటువంటి వివాదాలకు తావు లేకుండా విధులు నిర్వహించారని కొనియాడారు. సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ ఆయన ఎంతో సమర్థవంతంగా వ్యవహరించే వారని అన్నారు. ఆయన భవిష్యత్తులోనూ విద్యుత్‌శాఖకు సేవలం దించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గుంటూరు, సిఆర్‌డిఏ సర్కిల్స్ ఈఈలు తిరుమలశెట్టి శ్రీనివాసబాబు (గుంటూరు టౌన్-1), రమేష్ (గుంటూరు టౌన్ -2), ఆంజనేయులు (బాపట్ల), చిరంజీవి (తెనాలి), జె హరిబాబు (మాచర్ల), శ్రీనివాసరావు (నరసరావుపేట), విజిలెన్స్ డీఈఈ సూర్యప్రకాష్ ట్రాన్స్ కో ఎస్ఈ శ్రీధర్, మీటర్స్ సెక్షన్ ఈఈ సింగయ్య, అమరావతి ఈఈ రామ్‌భట్లు, ఇంజనీరింగ్ సంఘం నాయకులు బ్రహ్మయ్య, డిప్యూటీ ఈఈ, ఏఈలు పలువురు అధికారులు ఉన్నారు.

నేటి నుంచి అమరావతి నృత్యోత్సవం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 14: స్థానిక బృందావన గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికగా కేఆర్‌కేఎం మెమోరియల్ అకాడమీ అఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి రెండు రోజుల పాటు ఎనిమిదవ అమరావతి నృత్యోత్సవం-2024 (భారతీయ నాట్యరీతుల సమ్మేళనం) నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి కోకా విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. కూచి పూడి, భరతనాట్యం, ఆంధ్రనాట్యం, కథక్ నృత్యం, పేరిణీ నాట్యం వంటి అనేక నృత్య ప్రదర్శనలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో కళాకారులు, కళాభిమానులు పాల్గొనాలని కోరారు.

సీపీఆర్ పై అవగాహన అవసరం: డాక్టర్ హరిత

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబర్ 14 : గుండె సంబంధిత వ్యాధులు, సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిసస్కిటేషన్) పై అవగాహన కలిగి ఉండటం, దీనికి చికిత్స తెలియడం వలన కుటుంబసభ్యులు, ఇత రుల ప్రాణాలను రక్షించగలుగుతారని ఆస్టర్ రమేష్ హాస్పిటల్ సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పీఎస్ఎస్ హరిత తెలిపారు. శనివారం వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఎన్.ఎస్.ఎస్, ఎన్.సి.సి విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం సందర్భంగా 'యంగ్ లైఫ్ సేవర్స్' అంశంపై సదస్సు నిర్వహించారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్ సిబ్బంది సీపీఆర్ విధానాన్ని నమూనా ఆధారంగా వివరించారు. వీవీఐటీ ప్రిన్సిపాల్ వై.మల్లికార్జునరెడ్డి. ఎన్ఎస్ఎస్ అధికారి భక్తసింగ్, ఎన్‌సీసీ అధికారులు బిజెన్ బాషా, ఆళ్ల శ్రీవాణి పాల్గొన్నారు.



వీవీఐటీలో ప్రసంగిస్తున్న డాక్టర్ హరిత

తెలుగు ప్రజల హృదయాల్లో ఆత్రేయకు సుస్థిరస్థానం

గుంటూరు, సెప్టెంబరు 14: తెలుగు ప్రజల హృదయాల్లో సినీ గీత రచయిత ఆచార్య ఆత్రేయకు సుస్థిర స్థానం ఉందని సీనియర్ గాయకులు రత్నాజీ పేర్కొన్నారు. శనివారం స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆత్రేయ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్రేయ నాలుగు దశాబ్దాల పాటు నాటక, సినిమా పాటల రచయితగా తనదైన శైలిని ప్రదర్శించారన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, బిళ్ళా అశోక్, మల్లేశ్వరరావు,రజినీ, దిలీప్, కోటిరెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకాయమ్మ పాల్గొన్నారు.

డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపు ప్రారంభం

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 14: గుంటూరు నగరంలో వర్షపు నీరు డ్రెయిన్లలోకి మాత్రమే వెళ్లాలని, అందుకని, వాటిపై ఆక్రమణల తొలగింపు ప్రారంభించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం స్థానిక కొత్తపేటలోని ఓల్డ్ క్లబ్ రోడ్, రైలుపేట, పొత్తూరివారితోట, గుంటూరువారితోట తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఆక్రమణలు గమనించి, తొలగింపు పనులపై క్షేత్ర స్థాయి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయి పర్యటనలో ఓల్డ్ క్లబ్ రోడ్ లో డ్రెయిన్ పై పూర్తిగా ఆక్రమణలు జరిగి, మురుగుపారుదలకు వీలు లేకుండా ఉందన్నారు. పూడిక తీసేందుకు వీలు లేకుండా ర్యాంప్‌లు, ఆక్రమణలు ఉన్నాయని, తక్షణం వాటిని జెసిబిలతో తొలగిస్తున్నట్లు చెప్పారు. శనివారం సాయంత్రానికి ఓల్డ్ క్లబ్ రోడ్ రెండువైపులా డ్రైన్ పై ర్యాంప్ లు, ఆక్రమణలు తొలగించాలని ప్రజారోగ్య, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించామన్నారు. నగరంలో ప్రాంతాల వారీగా మేజర్ డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపునకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. పర్యటనలో తూర్పు ఎంహెచ్‌ఓ (ఇంచార్జి) రామారావు, డీఈఈ రాము, ఎస్ఎస్ అయుబ్ ఖాన్ పాల్గొన్నారు.

పది రోజుల్లోగా ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించండి

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 14 : విజయవాడలో వరద అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని గుంటూరు నగరంలో మురుగు పారుదలకు అడ్డుగా ఉన్న డ్రెయిన్లపై ఆక్రమణలను పూర్తిగా తొలగిస్తామని, నగర ప్రజలు, ప్రజా ప్రతినిధులు కూడా సహకరించాలని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. శనివారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశం నిర్వహించారు. విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో జీఎంసీ తరఫున చేపట్టిన సహాయక చర్యలు, డ్రెయిన్ల ఆక్రమణలు, పారిశుధ్యం, స్ట్రీట్ వెండింగ్ జోన్లు, జీఎంసీ ఆదాయ వనరుల పెంపునకు కార్యాచరణ, స్వచ్ఛతా హి సేవ తదితర అంశాల గురించి కమిషనర్ మాట్లాడారు. విజయవాడలోని 62వ డివిజన్‌కు ప్రత్యేక అధికారిగా అక్కడి ప్రజల కష్టాలను అతి చేరువగా గమనించామని, డ్రెయిన్ల ఆక్ర మణలు ఎంతటి పెద్ద నష్టాన్ని కల్గించాయో ప్రత్యక్షంగా చూశానన్నారు. గుంటూరులో ప్రధాన డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపు ప్రారంభించినట్లు చెప్పారు. పది రోజుల్లోగా డ్రెయిన్లపై ఆక్రమణలను వారే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేకుంటే జేసీబీలతో నగరపాలక సంస్థ సిబ్బంది తొలగిస్తారని స్పష్టం చేశారు. ఇప్పటికే క్షేత్ర స్థాయి పర్యటనలో నగరంలోని ఓల్డ్ క్లబ్ రోడ్ డ్రెయిన్‌ను పరిశీలిస్తే పూడిక, వ్యర్థాలతో ఉండి, ఆక్రమణలతో అత్యంత దారుణంగా ఉందని, డ్రెయిన్ల ఆక్రమణలపై ఉపేక్షించే పరిస్థితి లేదన్నారు. గుంటూరు నగర ప్రజారోగ్య కార్మికులు, చెత్త తరలింపు వాహనాలు విజయవాడకు సహాయ చర్యల కోసం వెళ్లడం వలన కొంత పారిశుధ్య సమస్యలు తలెత్తాయని, రానున్న మూడు రోజుల్లో అదనపు కార్మికులు, యంత్రాల ద్వారా సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

వీధి వ్యాపారుల సంక్షేమం దృష్ట్యా రెడ్, గ్రీన్, అంబర్ స్ట్రీట్ వెండింగ్ జోన్ల ఏర్పాటుకు అధికారులు, వివిధ సంస్థల భాగ స్వామ్యంతో కమిటీ ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధాన సెంటర్లలో పార్కింగ్ స్లాట్‌లను గుర్తిస్తామని పేర్కొన్నారు. జీఎంసీ ఆదాయానికి గండిపడే చర్యలు ఎవరు చేసినా ఉపేక్షించబోమని, ఆస్తి పన్ను విధింపు, తాగునీటి కుళాయి మీటర్లు, అనధికార నిర్మాణాలపై తమకు వివిధ వర్గాల నుండి ఫిర్యాదులు అందాయని, వాటిని త్వరలో క్షేత్రస్థాయి పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నగరంలో ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్న స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.



ఓల్డ్ క్లబ్ రోడ్డులో తొలగిస్తున్న ఆక్రమణను పర్యవేక్షిస్తున్న కమిషనర్



గణేశుడి సేవలో ఎమ్మెల్యే నసీర్, చిట్టిబాబు

వినాయక పందిళ్లలో అన్నదానం

గుంటూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని వినాయక చవితి పందిళ్లలో శనివారం జరిగిన అన్నదాన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. భక్తులకు స్వయంగా ఆయన వడ్డించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉదయం నుంచి సుమారు 45 మండపాలను సందర్శించినట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సిహెచ్ చిటిబాబు, ఎం.భారతి, ప్రభాకర్, జె.శ్రీనివాస్, నరసింహారావు, అల్లం బాజీ, రబ్బాని, హుస్సేన్, కనకారావు, వాణి, గణేశ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



గణేశుడి మండపాల్లో భక్తులతో డేగల ప్రభాకర్

ప్రజల్లో భక్తిభావం మరింత పెరగాలి: డేగల ప్రభాకర్

గుంటూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజల్లో భక్తిభావం మరింత పెరగాలని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ అన్నారు. స్థానిక పాతగుంటూరు, సీతారంనగర్, శ్రీనగర్, అన్నపూర్ణనగర్‌లలో జరుగుతున్న గణపతి ఉత్సవాల్లో శనివారం ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నసంతర్పణ కార్యక్రమన్ని ప్రారంభించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రభాకర్ మాట్లాడుతూ వినాయక నిమజ్జనం సమయంలో యువత జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా వుండాలని సూచించారు. గణపతి ఉత్సవాల కమిటీ నిర్వాహకులు ఈ సందర్భంగా ప్రభాకర్‌ను ఘనంగా సన్మానించారు.

శ్రీ పుట్టలమ్మ తల్లి సేవా సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నసంతర్పణ



గుంటూరు, సెప్టెంబరు 14: రూరల్ మండలం చల్లావారిపాలెంలో శ్రీ పుట్టలమ్మతల్లి సేవా సంఘం ఆధ్వర్యంలో 20వ గణపతి నవరాత్రి మహోత్సవాలు అంగ రంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం శ్రీ పుట్టలమ్మ తల్లి ఆలయం ఆవరణలో 10 వేల మందికి అన్న సం తర్పణ కార్యక్రమం జరిగింది. అంతకుముందు గణనాథుడికి ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. ఆదివారం స్వామి వారి లడ్డూ వేలం పాట అనంతరం భారీ ఊరేగింపుగా నిమజ్జన కార్యక్రమం జరుగుతుందని సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు.

దైవ చింతనతో కష్టాలను అధిగమించవచ్చు

గుంటూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మానవ జీవితంలో ఎదురయ్యే ఎలాంటి అడ్డంకులనైనా, ఎంతటి కష్టాన్నైనా దైవ చింతనతో అధిగమించవచ్చని తెలుగుదేశం, జనసేన కూటమి నాయకులు అన్నారు. స్థానిక శ్రీనివాసరావుపేట 12వ లైనులో అత్యంత వైభవోపేతంగా జరుగుతున్న వినాయక నవరాత్రి మహోత్సవ వేడుకల్లో శనివారం వారు పాల్గొన్నారు. జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి, ఒంగోలు శ్రీను, అభి యాదవ్, టీ శివారెడ్డి, శశి, తోట కార్తీక్ పాల్గొన్నారు.



శ్రీనివాసరావుపేట 12వ లైనులో వినాయక నవరాత్రి వేడుకల్లో పాల్గొన్న జనసేన, టీడీపీ నాయకులు

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

గుంటూరు(తూర్పు),సెప్టెంబరు 14: ప్రజా వ్యతిరేఖ విధాలను అవలంభిస్తున్న ప్రధాని మోదీపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక శారదా కాలనీలో అమర వీరుల మామిళ్ళపల్లి మాల కొండయ్య, గుర్రం బ్రహ్మయ్య సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ మోదీ పాలనలో దేశంలో పేద ప్రజలు మరింత పేదలవుతుంటే, ధన వంతులు మరింత ధనికులవుతున్నారని విమర్శించారు. తాను అధికారంలోకి వచ్చిన తర్వాత సంవత్సరానికి కోటి ఉద్యోగాలు ఇస్తానన్న మోదీ ఆచరణలో మాత్రం ముందుకు సాగలేదన్నారు. కార్యక్రమంలో సీ పీ ఐ నాయకులు కోటా మాల్యాద్రి, ఆకిటి అరుణ్ కుమార్, నూతలపాటి చిన్న దండు రవి, మంగా శ్రీనివాసరావు, రావుల అంజిబాబు, చెవుల కన్నయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్

అక్రమ నిర్మాణాన్ని నేలమట్టం చేయండి

● బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సిరిపురపు శ్రీధర్ శర్మ

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబర్ 14 : ప్రభుత్వ అధికారులు చాలా మంది తాము ఇంకా జగన్ ప్రభుత్వంలోనే పనిచేస్తున్నామనుకుంటూ వారు అరాచకాలకు, అక్రమాలకు పాల్పడుతురని, చంద్రబాబు ప్రభుత్వం అటువంటి అధికారులు తీరు మారేలా కఠిన చర్యలు చేపట్టాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గతంలో జగన్ ప్రభుత్వం చేసిన తప్పుడు పనులను చంద్రబాబు ప్రభుత్వం కొనసాగించకుండా అధికారులపై చర్యలు చేపట్టాలని కోరారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, మేయర్ కాసుల కోసం కక్కుర్తిపడి నగరంలో బస్సులు తిరగని ప్రాంతాల్లో కూడా 20 చోట్ల బస్సు బే నిర్మా ణాల నిమిత్తం భవానీ యాడ్ ఏజెన్సీకి 33 ఏళ్ల పాటు మున్సిపల్ రోడ్లను లీజుల పేరుతో ఎలా అనుమతి ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు కూతవేటు దూరంలోని గాంధీ పార్క్ ఎదురుగా నడిరోడ్డుని ఆక్రమించి అర్ధరాత్రి సమయంలో నిర్మిస్తున్న బస్ బే స్లాబ్ అక్రమ నిర్మాణం గురించి ప్రస్తావిస్తూ, దీనిని కూల్చి వేయాలని కోరారు.

17 నుంచి రైల్వేలో స్వచ్ఛతా హి సేవ

గుంటూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): . ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో 15 రోజుల పాటు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలనునిర్వహించనున్నట్లు డీఆర్ఎం ఎం.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అండర్-19 స్కూల్‌గేమ్ ఫెడరేషన్ కార్యదర్శిగా నరసింహారావు



గుంటూరు(విద్య),సెప్టెంబరు 14: ఉమ్మడి గుంటూరు జిల్లా జూనియర్ కళాశాలల వ్యాయామ ఉపాధ్యాయుల సర్వసభ్య సమావేశంలో స్కూల్‌గేమ్ ఫెడరేషన్ అండర్ -19 విభాగం నూతన కమిటీ ఎంపి కలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యదర్శిగా గుంటూరు నరసింహారావును(జీజేసీసత్తెనపల్లి) డీవీఈవో జే.పద్మ ఎంపిక చేశారు. సహాయ కార్యదర్శిగా సిహెచ్ పద్మాకర్(డాక్టర్ బిఆర్ అంబే ద్కర్ జూనియర్ కళాశాల-తెనాలి) ఎంపిక చేశారు. నూతన కార్యదర్శి, సహాయ కార్యదర్శులను వ్యాయామ ఉపాధ్యాయులు సుధాకరరెడ్డి, ఎస్‌కె మస్తాన్‌వలి, రాజు, మురళీకృష్ణ, శివరామకృష్ణ, ఆదిశేషు, రాజశేఖర్ అభినందించారు.



ర్యాలీలో పాల్గొన్న కళాశాల విద్యార్థినులు, అధ్యాపకులు

ఓజోన్‌పొర సంరక్షణపై బీహెచ్ కళాశాల విద్యార్థినుల ర్యాలీ

గుంటూరు(విద్య),సెప్టెంబరు 14: మానవాళికి రక్షణ కల్పించే పరిణమించిన ఓజోన్ పొరను పరిరక్షించాలని కోరుతూ స్థానిక బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ డిగ్రీ కళాశాల విద్యార్థినులు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఓజోన్ పొర వల్ల కలిగే లాభాలు, దానికి రంధ్రాలు పడి ధ్వంసమైతే కలిగే నష్టాలపై ప్రజలకు వివరిస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష,కార్యదర్శులు డాక్టర్ బీవి విజయభాస్కర్, చేగు శ్రీధర్, ప్రిన్సిపల్ కౌసల్యాదేవి, వైస్ ప్రిన్సిపల్ రాధామాధవి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ దీప్తి, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు హెల్త్ వర్కర్స్ ట్రెయినింగ్

మంగళగిరి(ఏపీ)లోని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయం 'మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ ట్రెయినింగ్ కోర్సు'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసింది. మహిళలు మాత్రమే అప్లయ్ చేసుకోవాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ/ఎయిడెడ్/ప్రైవేటు ఎంపీహెచ్‌డబ్ల్యు సంస్థల్లో శిక్షణ ఇస్తారు. కోర్సు వ్యవధి రెండేళ్లు.

అర్హత: ఇంటర్మీడియెట్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఏ గ్రూపు వారైనా దరఖాస్తు చేసుకోవచ్చు. సప్లిమెంటరీ అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు.

వయసు: డిసెంబరు 31 నాటికి 17 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్ల సడలింపు వర్తిస్తుంది.

ఎంపిక: మొత్తం సీట్లలో 60 శాతం 'ఫ్రీ సీట్లు' ఉన్నాయి. మిగిలినవి మేనేజ్‌మెంట్ సీట్లు. సెలెక్షన్ కమిటీ నిర్ణయం మేరకు అభ్యర్థుల అకడమిక్ ప్రతిభ ఆధారంగా ఫ్రీ సీట్లు భర్తీ చేస్తారు. మేనేజ్‌మెంట్ సీట్లకు సంబంధించి అభ్యర్థులు ఎంచుకొన్న ప్రైవేటు శిక్షణ కేంద్రాల్లో దరఖాస్తు సమర్పించాలి. వీటిని సెలెక్షన్ కమిటీకి పంపుతారు. కమిటీ ఆమోదించిన అభ్యర్థులకు ప్రవేశం లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.50
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** అక్టోబరు 15
- **తరగతులు ప్రారంభం:** అక్టోబరు 21
- **వెబ్‌సైట్:** cfw.ap.nic.in

ఐఐటీ మద్రాస్‌లో డిప్లొమా



మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీఎం)- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తారు. ప్రోగ్రామింగ్, డేటా సైన్స్ విభాగాలు అందుబాటులో ఉన్నాయి. క్వాలిఫయర్ ఎగ్జామ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి 8 నెలలు. ఒక్కో ప్రోగ్రామ్‌లో రెండు ఫౌండేషనల్ కోర్సులు, అయిదు ప్రోగ్రామ్ సంబంధిత కోర్సులు, ఒక స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సు, రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. ప్రోగ్రామ్‌నకు 35 క్రెడిట్స్ నిర్దేశించారు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు, డిగ్రీ ప్రోగ్రామ్‌లో కనీసం రెండేళ్లు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ఇన్ ప్రోగ్రామింగ్: ఇందులో కంప్యూటేషనల్ థింకింగ్, ప్రోగ్రామింగ్ ఇన్ పైథాన్ అనే ఫౌండేషనల్ కోర్సులు; డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, ప్రోగ్రామింగ్-డేటా స్ట్రక్చర్స్-అల్గారిథమ్స్ విత్ పైథాన్, మోడరన్ అప్లికేషన్ డెవలప్‌మెంట్-1&2 అనే ప్రోగ్రామింగ్ కోర్సులు; సిస్టం కమాండ్స్ అనే స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సు ఉంటాయి. మోడరన్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ 1&2లకు సంబంధించి రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది.

డిప్లొమా ఇన్ డేటా సైన్స్: ఇందులో మేథమెటిక్స్ ఫర్ డేటా సైన్స్, స్టాటిస్టిక్స్ ఫర్ డేటా సైన్స్ అనే ఫౌండేషనల్ కోర్సులు; మెషిన్ లెర్నింగ్ ఫౌండేషన్స్, బిజినెస్ డేటా మేనేజ్‌మెంట్, మెషిన్ లెర్నింగ్ టెక్నిక్స్, మెషిన్ లెర్నింగ్ ప్రాక్టీస్, బిజినెస్ అనలిటిక్స్ అనే డేటా సైన్స్ కోర్సులు; టూల్స్ ఇన్ డేటా సైన్స్ అనే స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సు ఉంటాయి. బిజినెస్ డేటా మేనేజ్‌మెంట్, మెషిన్ లెర్నింగ్ ప్రాక్టీస్‌లకు సంబంధించి రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది.

క్వాలిఫయర్ ఎగ్జామ్: డిప్లొమా ఇన్ ప్రోగ్రామింగ్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో ఇంగ్లీష్, ఆప్టిట్యూడ్, బేసిక్ మేథమెటిక్స్ పేపర్‌లు ఉంటాయి. ఇంగ్లీష్ పేపర్ 25 మార్కులకు ఉంటుంది. ఇందులో రీడింగ్ కాంప్రహెన్షన్, లిజెనింగ్ ఎబిలిటీ, గ్రామర్, రైటింగ్ అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. ఆప్టిట్యూడ్ పేపర్‌లో రీజనింగ్‌కు సంబంధించిన ప్రశ్నలు ఇస్తారు. మేథమెటిక్స్ పేపర్‌లో సెట్ థియరీ, నెంబర్ సిస్టమ్, కో-ఆర్డినేట్ జామెట్రీ, క్వాడ్రాటిక్ ఫంక్షన్స్, పాలినామియల్స్ ఫంక్షన్స్, లాగరిథమ్స్, గ్రాఫ్ థియరీ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం 3 గంటలు.

● డిప్లొమా ఇన్ డేటా సైన్స్‌లో ప్రవేశానికి నిర్వహించే ఎగ్జామ్‌లో ఇంగ్లీష్, ప్రోగ్రామింగ్ ఇన్ పైథాన్, మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటేషనల్ థింకింగ్ పేపర్‌లు ఉంటాయి. ఇంగ్లీష్, మేథమెటిక్స్ పేపర్‌లు పై ప్రోగ్రామ్‌కు నిర్వహించేవాటి మాదిరిగానే ఉంటాయి. పైథాన్ పేపర్‌లో ఇంట్రడక్షన్ టు పైథాన్, కండిషనల్ స్టేట్‌మెంట్స్, లూప్స్, లిస్ట్స్, ఫంక్షన్స్, కలెక్షన్స్, రికర్షన్, ఫైల్ హ్యాండిలింగ్ అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. స్టాటిస్టిక్స్ పేపర్‌లో డేటా, స్కేల్స్ ఆఫ్ మెజర్‌మెంట్, డేటా ఫ్రీక్వెన్సీ, వేరియబుల్స్, పర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, ప్రాబబిలిటీ, రాండం వేరియబుల్స్, వేరియన్స్ తదితర అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. కంప్యూటేషనల్ థింకింగ్ పేపర్‌లో మల్టిపుల్ ఇటరేషన్స్, ఫిల్టరింగ్, ఫ్లో ఛార్ట్, సైడ్ ఎఫెక్ట్‌లు, గ్రాఫ్, మ్యాట్రిక్స్, ట్రీ, బ్యాక్ ట్రాకింగ్, క్లాసిఫికేషన్, ఆబ్జెక్ట్ ఓరియంటేషన్ ప్రోగ్రామింగ్, రిమోట్ ప్రొసీజర్ కాల్, పోలింగ్ తదితర సాంకేతిక అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం 4 గంటలు.

● క్వాలిఫయర్ ఎగ్జామ్‌లో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులకు ఒక్కో పేపర్లో 40 శాతానికి తగ్గకుండా మొత్తమ్మీద 50 శాతం మార్కులు రావాలి. ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఒక్కో పేపర్లో 35 శాతానికి తగ్గకుండా మొత్తమ్మీద 45 శాతం మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఒక్కో పేపర్లో 30 శాతానికి తగ్గకుండా మొత్తమ్మీద 40 శాతం మార్కులు రావాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.6,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.3,000; ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన దివ్యాంగులకు రూ.1500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 22
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, అనంతపురం, భీమవరం, గుంటూరు, కడప, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం
- **డిప్లొమా క్వాలిఫయర్ ఎగ్జామ్ తేదీ:** డిసెంబరు 22
- **ప్రోగ్రామ్ రిజిస్ట్రేషన్:** 2025 జనవరి 8 నుంచి 9 వరకు
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** 2025 జనవరి 10 నుంచి
- **వెబ్‌సైట్:** diploma.iitm.ac.in

దిక్సూచి
DIKSUCHI

అంబేద్కర్ యూనివర్సిటీలో పీజీ డిప్లొమా



శ్రీకాకుళం(ఏపీ)లోని డా.బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ(డాబీఆర్ఏయూ)- పీజీ డిప్లొమా ఇన్ గాంధియాన్ సోషల్ వర్క్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. కోర్సు వ్యవధి ఏడాది. ఇందులోనే ఆర్నెల్ల ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ప్రోగ్రామ్ చివరలో ప్రాజెక్ట్ రిపోర్ట్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. కోర్సులో భాగంగా క్యాంపస్ తరగతులు, ఫీల్డ్ వర్క్ ఉంటాయి. మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

అర్హత: ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సామాజిక, న్యాయ సంబంధిత రంగాల్లో పనిచేస్తున్న వారికి ఈ కోర్సు ఉపకరంగా ఉంటుంది. దీనిని పూర్తిచేసినవారు ఎన్జీఓ సంస్థలు, మీడియా సంస్థలు, గ్రామీణాభివృద్ధి సంస్థలు, కౌన్సెలింగ్ సెంటర్లు, సామాజిక అధ్యయన కేంద్రాల్లో ఉపాధి పొందే వీలుంది.

ముఖ్య సమాచారం

- **కోర్సు ఫీజు:** రూ.10,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 15
- **వెబ్‌సైట్:** www.drbrau.edu.in

నవ్య | చిత్రజ్యోతి

సమంతకు అరుదైన గౌరవం



నటి సమంతకు ఓ అరుదైన గౌరవం దక్కింది. ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ (ఐఫా) ఉత్సవం అవార్డ్స్ కార్యక్రమం ఈ నెల 27న దుబాయ్‌లో జరగనుంది. కార్యక్రమంలో ఆమెను 'ఉమెన్ ఆఫ్ ద ఇయర్' అవార్డుతో సన్మానించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. "ఈ తరానికి చెందిన ఉత్తమ నటుల్లో సమంత ఒకరు. తన వైవిధ్యమైన పాత్రలతో అభిమానులను నిరంతరం ఆకట్టుకునే ఆమెకు ఈ అవార్డును అందజేయటం ఆనందంగా ఉంది" అని ఐఫా నిర్వాహకులు తెలిపారు. "ఐఫా ఉత్సవం నాకెల్లప్పుడూ ప్రత్యేకమే. దక్షిణాది సినిమాను ప్రపంచ ప్రేక్షకులకు తెలియజెప్పే ఈ వేదికపై పాల్గొనడానికి నేను ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాను" అని సమంత పేర్కొన్నారు.

150 మంది ఫైటర్లు... 300 మంది జూనియర్స్



నందమూరి కల్యాణ్‌రామ్ నటిస్తున్న తాజా చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ యాక్షన్ ప్యాక్డ్ ఎంటర్‌టైనర్‌ను అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం యాక్షన్ డైరెక్టర్ పీటర్ హెయిన్ సారథ్యంలో ఓ భారీ యాక్షన్ ఎపిసోడ్ చిత్రీకరిస్తున్నారు. 15 రోజుల పాటు కొనసాగే ఈ చిత్రీకరణంలో 150 మంది ఫైటర్లు, 300 మంది జూనియర్ ఆర్టిస్టులు పాల్గొంటున్నారు. సినిమాకు ఈ యాక్షన్ ఎపిసోడ్ హైలైట్‌గా నిలుస్తుందని నిర్మాతలు చెప్పారు. విజయశాంతి పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్న ఈ సినిమాలో సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

రాఘవ లారెన్స్ 25వ సినిమా



'రాక్షసుడు', 'ఖిలాడీ' చిత్రాల తర్వాత నిర్మాత కోనేరు సత్యనారాయణ మరో భారీ చిత్ర నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. యాక్షన్, అడ్వంచర్ అంశాలతో రూపుదిద్దుకొనే ఈ చిత్రంలో రాఘవ లారెన్స్ హీరోగా నటించనున్నారు. ఇది ఆయనకు 25వ సినిమా కావడం గమనార్హం. ప్యాన్ ఇండియా రేంజ్‌లో తెర కెక్కనున్న ఈ సినిమాకు రమేశ్ వర్మ దర్శకుడు. ఆయనతో కోనేరు సత్యనారాయణ తీస్తున్న మూడో చిత్రం ఇది. నవంబర్‌లో షూటింగ్ ప్రారంభించి, వచ్చే ఏడాది సమ్మర్‌లో విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు. సినిమా గురించి పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

దేవర సినిమాను కలసి చూద్దాం

అభిమానికి ఎన్టీఆర్ వీడియో కాల్





బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న తన అభిమాని కౌశిక్‌ను జూనియర్ ఎన్టీఆర్ శనివారం పరామర్శించారు. కౌశిక్ బెంగళూరు కిద్వాయ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. ఆ అభిమానితో దాదాపు 10 నిమిషాలు ఎన్టీఆర్ వీడియో కాల్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. "నువ్వు నవ్వుతుంటే చాలా బాగున్నావు. ధైర్యంగా ఉండు. ట్రీట్‌మెంట్ తీసుకుని కోలుకో. తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలి. త్వరలోనే కలుద్దాం. 'దేవర' సినిమాను ఇద్దరం కలసి చూద్దాం. ట్రీట్‌మెంట్ ఖర్చులకు సాయపడతాను" అని ఎన్టీఆర్ భరోసా ఇచ్చారు. అలాగే కౌశిక్ తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. ఆ వీడియో కాల్‌లో కౌశిక్ మాట్లాడుతూ "అన్నా.. మిమ్మల్ని అస్సలు అనుకోలేదు" అని అన్నారు. దానికి బదులుగా ఎన్టీఆర్ "భలే వాడివే. నీతో మాట్లాడకుంటే ఎలా" అని అన్నారు. ఇటీవలే కౌశిక్ తల్లి ఓ వీడియో ద్వారా కుమారుడి ఆరోగ్య పరిస్థితి, జూనియర్ ఎన్టీఆర్ పట్ల తన కుమారుడికి ఉన్న అభిమానాన్ని తెలిపారు. దీంతో స్పందించిన జూనియర్ ఎన్టీఆర్, తిరుపతికి చెందిన తమ అభిమానసంఘం కన్వీనర్ కృష్ణయాదవ్‌ను బెంగళూరుకు పంపించారు. తనతో మాట్లాడించాలని సూచించారు. దీంతో కృష్ణయాదవ్‌తో పాటు అభిమానసంఘం కన్వీనర్లు మాణిక్యం, బసవ కిద్వాయ్ ఆసుపత్రిలో బాధితుడిని పరామర్శించారు.

- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

విజయ్‌కి ఇదే ఆఖరి చిత్రమా?



అగ్రహీరో విజయ్ నటించే తదుపరి చిత్రాన్ని శనివారం సాయంత్రం అధికారికంగా వెల్లడించారు. 'విజయ్69' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కే ఈ చిత్రం వచ్చే ఏడాది అక్టోబరు నెలలో ప్రేక్షకుల ముందుకురానుంది. మరో అగ్రహీరో అజిత్ కుమార్‌కు 'నెర్కొండ పార్వై' 'వలిమై', 'తుణివు' వంటి వరుస హిట్ చిత్రాలను అందించిన హెచ్.వినోద్ ఈ సినిమాకు దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మాత వెంకట్ కె.నారాయణ భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీత స్వరాలు సమకూర్చే ఈ సినిమాలో పూజా హెగ్డే, సిమ్రాన్, మమిత బైజులను ఎంపిక చేయగా, విలన్ పాత్రను బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ పోషిస్తున్నారు. కెమెరా: సత్యన్ సూరియన్. ఈ చిత్రానికి సంబంధించి విడుదల చేసిన పోస్టరులో 'త్వరలోనే ప్రజాస్వామ్యానికి వెలుగు చూపే వ్యక్తి రాక..' అంటూ ఆంగ్లంలో రాయగా, ఒక చేతితో టార్చిను పట్టుకుని కనిపిస్తున్నారు. కాగా, ఈ చిత్రం తర్వాత విజయ్ సినిమాలకు స్వస్తి చెప్పి.. పూర్తిస్థాయిలో క్రియాశీలక రాజకీయాల్లో నిమగ్నం కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవలే ఆయన 'తమిళగ వెట్రి కళగం' అనే పేరుతో రాజకీయ పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే.

- చెన్నై, ఆంధ్రజ్యోతి

యుద్ధం నేపథ్యంలో ప్రేమకథ





సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్, విక్కీ కౌశల్ నటిస్తున్న చిత్రం 'లవ్ అండ్ వార్'. జనవరిలో సినిమాను మేకర్స్ ప్రకటించిన మేకర్స్.. వచ్చే ఏడాది క్రిస్మస్‌కు సినిమాను విడుదల చేస్తున్నట్లు మొదట తెలిపారు. అయితే, తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని మార్చారు. 2026లో మార్చి 20న రంజాన్ సందర్భంగా సినిమాను విడుదల చేస్తున్నారు. ఈ ఎపిక్ లవ్ డ్రామా కథేంటేంటన్నది ఇప్పుడు అందరిలోనూ ఆసక్తిని కలిగిస్తోంది. ఈ సినిమా కథను మేకర్స్ ప్రకటించకున్నా.. ఇది యుద్ధం నేపథ్యంలో జరిగే ప్రేమకథ అని టాక్ వినిపిస్తోంది. అదే రోజున షారుక్ ఖాన్ నటించిన క్రైమ్ డ్రామా 'కింగ్' సినిమా విడుదలవుతోంది. కాగా, సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలోనే 'సావరియా' చిత్రంతో రణ్‌బీర్ సినీ రంగ ప్రవేశం చేశారు.

విడుదలకు ముందే అరవై అవార్డులు

ఇన్ ప్రోగ్రెస్



హీరోయిన్ వేదిక లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'ఫియర్'. సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని దర్శకురాలు హరిత గోగినేని రూపొందిస్తున్నారు. సుజాత రెడ్డితో కలసి ఏ.ఆర్ అభి నిర్మిస్తున్నారు. అరవింద్ కృష్ణ ఓ ప్రత్యేక పాత్ర పోషిస్తున్న 'ఫియర్' చిత్రం విడుదలకు ముందే వివిధ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో అరవైకి పైగా అవార్డులు పొంది సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. 'ఫియర్' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దర్శకుడు ప్రభు దేవా సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. త్వరలో థియేటర్లలో విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు.

కమ్ బ్యాక్ ఫిల్మ్



'శ్రీ సీతారాముల కల్యాణం చూతము రారండి', 'అన్నయ్య', 'ప్రేమ కోసం', 'శివరామరాజు' తదితరులు చిత్రాల్లో నటించిన హీరో వెంకట్ కమ్ బ్యాక్ ఫిల్మ్ 'హరుడు'. హెబ్బా పటేల్, సలోని, నటాషా, అలీ ఇతర ముఖ్య పాత్రధారులు. రాజ్ తాళ్లూరి దర్శకత్వంలో డాక్టర్ ప్రవీణ్ రెడ్డి, డాక్టర్ దిక్కల లక్ష్మణరావు నిర్మిస్తున్నారు. ఇది కంప్లీట్ మాస్ ఎంటర్‌టైనర్ అని దర్శకుడు చెప్పారు. నవంబర్‌లో చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాతలు తెలిపారు.


కౌన్ బనేగా కరోడ్‌పతిలో.. పవన్‌పై ప్రశ్న



పవన్‌కల్యాణ్‌కు ఇండియా వైడ్ ఉన్న క్రేజ్ ఉన్న సంగతి తెలిసిందే. ఈ విషయం మరోసారి రుజువైంది. 'కౌన్ బనేగా కరోడ్‌పతి' సీజన్ 16కు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న అమితాబ్ బచ్చన్.. కంటెస్టెంట్‌ను ఓ ఆసక్తికర ప్రశ్నను అడిగారు.. జూన్‌లో ఆంధ్రప్రదేశ్‌లో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వ్యక్తి ఎవరు? అని. ఇందుకు కంటెస్టెంట్ ఆడియన్స్ పోల్ ఎంచుకున్నారు. ఆడియన్స్‌లో 50శాతం మంది పవన్ అని జవాబు చెప్పారు. దీంతో ఈ సమాధానాన్ని లాక్ చేశారు. అది సరైన సమాధానం కావడంతో కంటెస్టెంట్ రూ. లక్ష అరవై వేలు గెలుచుకుని మరో ప్రశ్నకు వెళ్లారు.

ఎంత గౌరవమో!

ఫ్లాష్‌బ్యాక్



తెలుగుజాతి గర్వించదగ్గ నటుడు నందమూరి తారకరామారావు. చిత్ర పరిశ్రమలో తను ఎదుగుతూ మరెందరికో అవకాశాలు కల్పించి ఆదుకున్న మంచి వ్యక్తిగా ఎన్టీఆర్‌కు పేరుంది. అలా ఆయన ఆశీస్సులతో తన కెరీర్‌ను చక్కగా మలుచుకున్న పాత తరం హీరోల్లో కాంతారావు ఒకరు. తొలి సినిమా 'ప్రతిజ్ఞ' తర్వాత సరైన అవకాశాలు లేక ఇంటికి తిరిగి వెళ్లిపోదామనుకున్న ఆయన్ని పిలిచి తన సొంత చిత్రం 'జయసింహ'లో తనతో సమానమైన పాత్ర ఇచ్చి ప్రోత్సహించారు ఎన్టీఆర్. అలాగే 'లవకుశ' సినిమాలో లక్ష్మణుడి పాత్ర కూడా ఎన్టీఆర్ గట్టి రికమండేషన్‌తోనే కాంతారావుకు దక్కింది. అలా ఎన్నో సార్లు తనని ఆదుకొన్న ఎన్టీఆర్ అంటే కాంతారావుకు ఎంతో అభిమానం, గౌరవం. కాంతారావు సొంత సినిమా పూజా కార్యక్రమానికి ఎన్టీఆర్ హాజరైన అరుదైన దృశ్యం ఇది. ఇందులో హీరోయిన్ జయంతి కూడా ఉన్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

మంగళగిరి తాడికొండ ప్రత్తిపాడు

క్రీడాప్రాంగణంలో గణనాధుడికి లోకేశ్ పూజలు



తాడేపల్లిలో వినాయకునికి పూజలు చేస్తున్న లోకేశ్

తాడేపల్లి, సెప్టెంబరు 14: తాడేపల్లి బైపాస్ రోడ్డులోని క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని సందర్శించి మంత్రి నారా లోకేశ్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నేతలు, మహిళలు లోకేశ్‌కు సాదర స్వాగతం పలికారు. లోకేశ్ గజమాలను గణనాధుడికి వేసి హారతినిచ్చి పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ, మండల నేతలు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

కొత్తపేటలో భక్తులకు అన్న సంతర్పణ

మంగళగిరి, సెప్టెంబరు 14: మంగళగిరి రెండో వార్డు కొత్తపేటలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. కొత్తపేట యువసేన ఆధ్వర్యంలో పదో వార్షికోత్సవం సందర్భంగా శనివారం వేలాది మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, వార్డు మాజీ కౌన్సిలరు రంగిశెట్టి నరేంద్ర (బాబీ) తదితరులు స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కొల్లూరి కల్యాణ్, సుంకర బ్రదర్స్, నరేశ్, శ్రావణ్, వంశీ, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడు, సెప్టెంబరు 14: మండలపరిధిలోని ఆయా గ్రామాల్లో గణపతి నవరాత్రులు 8వ రోజు కొనసాగుతున్నాయి. నాగులపాడులో బొడ్రాయి సెంటర్లో వినాయక యూత్, తూర్పు బజారులో శ్రీరామ యూత్ ఆధ్వర్యంలో, పలు చోట్ల ఏర్పాటు చేసిన గణనాథులను ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లపై ఉంచి డప్పువాయిద్యాలు, బాణసంచా, డీజేలతో గ్రామ వీధుల్లో ఊరేగింపు చేసి సూర్యలంక సముద్రతీరాన నిమజ్జనం చేశారు.

తాడికొండ, సెప్టెంబరు 14: మండలపరిధిలోని బడేపురంలో జనసేన యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, టీడీపీ రాష్ట్ర వాణిజ్యవిభాగం జనరల్ సెక్రటరి బండ్ల కోటేశ్వరరావు, తాడికొండ సీఐ కే.వాసు కమిటీ సభ్యులు తాయికాంతికిరణ్, పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిడుముక్కలలో తెలుగుయువత ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన వేడుకలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు చిగురుపాటి అనూప్, బండ్ల శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

తుళ్లూరు, సెప్టెంబరు, 14 : మండలపరిధిలోని హరిశ్చంద్రపురంలో గణేష్ నిమజ్జనోత్సవం నిర్వహించారు. విఘ్నేశ్వరుడితో పాటు చంద్రబాబునాయుడు నిలువెత్తు చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఊరేగించారు. టీడీపీ, జనసేన నాయకులు ఊరేగింపుని ప్రారంభింపజేశారు. రాష్ట్ర పరిపాలన గాడిలో పెట్టే అనుభవం కలిగిన చంద్రబాబు ముఖ్యమంత్రి కావటంతో వినాయక చవితి వేడుకలు అత్యంత భక్తితో నిర్వహిస్తున్నామని టీడీపీ గ్రామ అధ్యక్షుడు కొమ్మినేని కోటేశ్వరావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. తుళ్లూరులో పలు సెంటర్‌లలో నెలకొల్పిన వినాయక విగ్రహాలను ఊరేగించి నిమజ్జనం చేశారు.

6.5 లక్షలకు వినాయక లడ్డు మన్నవ బ్రదర్స్ కైవసం

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 14: మండలపరిధి కొర్నెపాడుతోపులోని ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద ఉన్న లడ్డును వెంపకరాల కిషోర్ ఆధ్వర్యంలో మన్నవ బ్రదర్స్ 6.5 లక్షలకు కైవసం చేసుకున్నారు. సాయంత్రం భారీ ఊరేగింపుతో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మోతడకలో చలపతి ఫార్మసీ కళాశాల ఏర్పాటు



ఆవిష్కరిస్తున్న చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, ప్రిన్సిపాల్

తాడికొండ, సెప్టెంబరు 14: చలపతి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో మోతడకలో నూతనంగా చలపతి ఫార్మసీ కళాశాలను 2024-25 విద్యా సంవత్సరంలో ప్రారంభిస్తున్నట్లు చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు తెలిపారు. శనివారం కళాశాలలోని చలపతి ఫార్మసీ కళాశాల కౌన్సెలింగ్ కోడ్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైవీ మాట్లాడుతూ బీఫార్మసీ ప్రోగ్రామ్‌లో 100మంది విద్యార్థులను చేర్చుకోవటానికి ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, రాష్ట్ర ప్రభుత్వం, విశ్వవిద్యాలయం నుంచి ఆమోదం లభించిందన్నారు. కౌన్సెలింగ్ కోడ్‌ను సీసీపీవైగా నిర్ధారించినట్లు తెలిపారు. కళాశాలలో డిజిటలైజ్డ్ తరగతి గదులు, విస్తృతమైన గ్రంథాలయం, అంకిత భావం కలిగిన అధ్యాపకులు, ఔషధ పరిశోధన విద్యలో చలపతి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ అత్యుత్తమ కేంద్రంగా ఉన్నదన్నారు. ఔషధ విద్యలో కొత్త మార్పులను నెలకొల్పి ఫార్మస్యూటికల్ రీసెర్చ్, ఇన్నోవేషన్ కార్యక్రమాలను చేపడతామన్నారు. కార్యక్రమంలో చలపతి విద్యాసంస్థల సెక్రటరి వై సుజిత్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 28వేల 680 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 14: ఎగువన ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 36వేల 692 క్యూసెక్కుల వరద నీరు శనివారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 11.7 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 40 గేట్లను అడుగు మేర ఎత్తి దిగువకు 28 వేల 680 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు జేఈ తెలిపారు.

పశ్చిమ డెలా కాల్వకు 3506 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, సెప్టెంబరు 14: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 3506 క్యూసెక్కుల సాగునీటిని శనివారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.7 అడుగుల నీటి మట్టం ఉండగా, దిగువకు 28,680 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 1861, తూర్పుకాల్వకు 975, పశ్చిమకాల్వకు 400, నిజాంపట్నం కాల్వకు 410, కొమ్మమూరుకాల్వకు 534 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులకు విశ్వేశ్వరయ్య ఆదర్శనీయుడు

మేడికొండూరు సెప్టెంబరు 14: మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆదర్శనీయుడని మండలంలోని గుండ్లపాలెంలోని ఎస్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాసు చెప్పారు. విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా శనివారం కళాశాలలో ఇంజనీర్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరి మాట్లాడుతూ ఇంజనీర్స్ డే రోజున విద్యార్థులు నూతన ప్రాజెక్టులు చేపట్టి ప్రదర్శించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.తిలక్ బాబు, వివిధ శాఖల అధిపతులు నాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యలో నైపుణ్యం అవసరం

● ఈడీసీ కన్వీనర్ రాధిక సజ్జ

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 14: ఇంజనీరింగ్‌లో విజయం సాధించాలంటే నైపుణ్యంతో కూడిన విశ్లేషనాత్మక పరిశీలన ఉండాలని ఏవీఏ ఎస్ఏఆర్ఎస్ హలా కో ఫౌండర్ అశ్వథీ వేణుగోపాల్, ఈడీసీ కన్వీనర్ రాధిక సజ్జ విద్యార్థులకు సూచించారు. మండలపరిధి మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ మూడో సంవత్సరం విద్యార్థులకు మేక్‌స్కిల్స్ ఆధ్వర్యంలో 36 గంటలు ఏకదాటిగా జనరేటివ్ ఏఐ హాక్‌థాన్ ముగింపు కార్యక్రమానికి హాజరైన అశ్వథీ వేణుగోపాల్, రాధిక విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్ళు, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ సమావేశం

ఫిరంగిపురం, సెప్టెంబరు 14: ఫిరంగిపురంలో మండల బీజేపీ సభ్యత్వ కార్యక్రమ సమావేశం శనివారం జరిగింది. దీనికై బీజేపీ జిల్లా సభ్యత్వ ప్రముఖ్ తాడువాయి రామకృష్ణ మాట్లాడుతూ మండలంలో బీజేపీ సభ్య త్వాన్ని పెంచి కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలవాలని ఆయన కోరారు.

బాధితులకు విరాళాల వెల్లువ



మంత్రి లోకేశ్‌కు చెక్కును అందజేస్తున్న పిచ్చేశ్వరరావు

మంగళగిరి, తాడేపల్లి సెప్టెంబరు 14: విజయవాడ వరద బాధితుల సహాయార్థం మంగళగిరి రత్నాలచెరువుకు చెందిన దివి పిచ్చేశ్వరరావు రూ.50 వేల చెక్కును రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు అందజేశారు. మంగళగిరి పట్టణానికి చెందిన ఆరెకటిక సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కే.శివరాం బాబాజీ రూ.లక్ష చెక్కును మంత్రి నారా లోకేశ్‌కు అందజేశారు. బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి తాడేపల్లి మండలం నులకపేటకు చెందిన వనమా కోటేశ్వరరావు రూ.50 వేల విరాళం అందజేశారు. ఈ చెక్కును శనివారం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ వ్యవ హారాల సమన్వయకర్త నందం అబద్దయ్యకు అందజేశారు. కార్యక్రమంలో గుత్తికొండ ధనుంజయరావు పాల్గొన్నారు.



అబద్దయ్యకు చెక్కును అందజేస్తున్న వనమా కోటేశ్వరరావు

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 14: వరద బాధితులను ఆదుకొనేందుకు పార్టీలకు అతీతంగా గ్రామాల్లో విరాళాల సేకరణ కొనసాగుతుంది. మండల పరిధి వింజనంపాడు గ్రామంలో స్థానికులు గడప గడప నుంచి సేకరించగా వచ్చిన రూ.6,55,630 నగదును శనివారం మాజీ మంత్రి డాక్టర్ మాకినేని పెదరత్తయ్యకు వింజనంపాడు గ్రామస్థులు అందజేయగా ఆయన గ్రామస్థులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

● ముట్లూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మోదుకూరి వీరయ్య చౌదరి, వీరిశెట్టి జగన్మోహనరావు, నిమ్మగడ్డ శేషగిరిరావు, తదితరులు పెదరత్తయ్యను ఆయన నివాసంలో కలసి సేకరించిన 45వేల నగదను అందజేశారు.

రాజధాని రైతుల సాయం

తుళ్లూరు, సెప్టెంబరు 14: రాజధాని అమరావతి రైతులు, మహిళలు వరద బాధితులకు బాసటగా నిలిచారు. శనివారం విజయవాడలో ముంపునకు గురైన వాంబేకాలనీ, సుందరయ్యనగర్‌లో వారు పర్యటించారు. బియ్యం సంచులు, దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. 500ల కుటుంబాలకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో గుర్రం జయకృష్ణ, ఆలూరి కృష్ణప్రసాద్, గద్దె రవి, ఉప్పాళ్ల వేదవతి, కళ, పద్మ అరుణ, సింధు, సంధ్య, శివకుమారి పాల్గొన్నారు.

మారుతీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న జంగాల వెంకటేష్, బోండా ఉమ

తాడేపల్లి, సెప్టెంబరు 14: ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, బోండా ఉమ స్ఫూర్తితో మారుతి ఫౌండేషన్ చైర్మన్ జంగాల సాంబశివరావు, సింగరాయకొండకు చెందిన టీడీపీ నాయకులు కుర్రా సుబ్బారావు, కుర్రా మధుబాబుల సంయుక్త సహకారంతో రూ.లక్షా 50వేల విలువగల నిత్యావసర సరకులను 150 మంది వరద బాధితులకు శనివారం తెలుగుయువత గుంటూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జంగాల వెంకటేష్, బోండా ఉమా సమక్షంలో వారి కార్యాలయానికి వెళ్లి బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ మారుతీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వరద బాధితులకు మారుతీ ఫౌండేషన్ చైర్మన్ జంగాల సాంబశివరావు రూ.లక్ష, సింగరాయకొండకు చెందిన టీడీపీ నేత కుర్రా సుబ్బారావు, కుర్రా మధుబాబు, ఆర్థిక సాయంతో రూ.1.50లక్షలు ఒక్కో బ్యాగులో వెయ్యి రూపాయలు విలువ చేసే కంది పప్పు, మినపగుళ్లు, ఇడ్లీరవ్వ, పెసరపప్పు, గోధుమ పిండి, పంచదార, సన్‌ఫ్లవర్ ఆయిల్, చింతపండు కారంప్యాకెట్లు కలిగిన 150 బ్యాగుల నిత్యావసర సరకులు బాధితులకు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో లింగంశెట్టి కిషోర్, అడపా నరేష్, నక్కా నవీన్‌రాజా, సిగిరిశెట్టి లీలాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయాలి



నిడమర్రులో సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నేతలు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 14: పీడిత ప్రజల పక్షాన పాలక ప్రభుత్వాలపై రాజీలేని పోరాటాలు చేసిన సీతారాం ఏచూరి ఆశయ సాధన కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి పిలుపునిచ్చారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభను నిడమర్రు గ్రామంలో శనివారం సాయంత్రం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు ఎం.భాగ్యరాజు, కే వీరయ్య, గైరబోయిన నాగేశ్వరరావు, కే.నాగేశ్వరరావు, బుల్లెబ్బాయి, ఎం అంకమ్మరావు, నానయ్య, స్టాలిన్, వీరయ్య, ఎం.రాజముని పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు సీతారాం ఏచూరి

● సీపీఎం రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి

తాడేపల్లి, సెప్టెంబరు 14: అందరి మన్ననలు చూరగొని సీపీఎం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేసిన సీతారాం ఏచూరి చిరస్మరణీయులని, ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం తాడేపల్లి రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. వడ్డేశ్వరంలో శనివారం సాయంత్రం జరిగిన ఏచూరి సంస్మరణ సభలో వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మార్క్సిజాన్ని అధ్యయనం చేసి ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడిగా పని చేసి మరణించే సమయం వరకు సీపీఎం జాతీయ కార్యదర్శిగా సేవలు అందించిన సీతారాం స్ఫూర్తిని కార్యకర్తలు మరువరాదన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి నేతలు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నేత జొన్నా శివశంకర్, గుడిసె శ్రీనివాసరావు, కారసాల స్వాతి, అమ్మిశెట్టి రామారావు, ఎస్‌కె ఘన్ను, వెంకటేశ్వరరావు, ప్రభుకుమార్, ఏలియా, శౌరి, తదితరులు పాల్గొన్నారు. ప్రకాష్‌నగర్‌లో సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వేముల దుర్గారావు, బూరగ వెంకటేశ్వర్లు, శాస్త్రీ, విశాలాంధ్ర, శౌరి బర్తొలోం, చినదుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ కన్వెన్షన్‌లో దొంగతనం

తాడికొండ, సెప్టెంబరు 14: మండల పరిధిలోని మోతడక గ్రామంలో నిర్మిస్తున్న కాకతీయ కన్వెన్షన్ సొసైటీ, వృద్ధాశ్రమంలో రూ.1.5 లక్షల విలువైన విద్యుత్, పంబ్లింగ్ వస్తువులు దొంగతనం జరిగినట్లు పోలీసులు తెలిపారు. పోలీసు తెలిపిన వివరాల ప్రకారం కాకతీయ కన్వెన్షన్ సొసైటీ భవనం నిర్మాణదశలో ఉండటంతో ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులు జరుగుతున్నాయి. గురువారం రాత్రి పనులు ముగించుకొని సిబ్బంది వెళ్లిపోయారు. భవనం సూపర్‌వైజర్, ఇద్దరు వాచ్‌మెన్‌లు ఉన్నారని తెలిపారు. శుక్రవారం తెల్లవారు జామున భవనం చుట్టపక్కల సూపర్‌వైజర్ పరిశీలించగా మూడు గోదాముల తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. గోదాములు లోపలికి వెళ్లి చూడగా అక్కడ ఉన్న ఎలక్ట్రికల్ వస్తువులు, ప్లంబింగ్ సామాగ్రి కన్పించలేదు. గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేసినట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కే వాసు తెలిపారు.

తిరుపతి పాదయాత్రకు బయలుదేరిన మహిళలు

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 14: గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును అరెస్టు చేసి జైలుకు వెళ్లిన నేపథ్యంలో వట్టిచెరుకూరు గ్రామానికి చెందిన ఆరుగురు మహిళలు తమ మొక్కుబడి తీర్చుకునేందుకు శుక్రవారం వట్టిచెరుకూరు నుంచి తిరుమలకు బయలుదేరి వెళ్లారు. జైలు నుంచి తక్షణమే విడుదల కావాలని, అందుకు తాము తిరుపతి నుంచి తిరుమల స్వామి చెంతకు మెట్ల మార్గాన కాలినడకన వచ్చి మొక్కులు తీర్చుకుంటామని మొక్కుకున్న నేపథ్యంలో నేడు తిరుమలకు వెళుతున్నట్లు గ్రామానికి చెందిన యడ్లపల్లి అపర్ణ, కొత్తపల్లి లక్ష్మీసునీత, సుజాత, కస్తూరి, లక్ష్మీ వెల్లడించారు.

252 తెలంగాణ మద్యం బాటిళ్లు స్వాధీనం

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 14: తుళ్లూరు మండలం అనంతవరంలో అక్రమంగా విక్రయిస్తున్న తెలంగాణ మద్యం బాటిళ్లను మంగళగిరి సెబ్ అధికారులు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మంగళగిరి సెబ్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సెబ్ డీఎస్‌ఈవో ఎం వెంకటేశ్వరరావు వివరాలను వెల్లడించారు. అనంతవరంనకు చెందిన కొమ్మినేని శివకుమారి, కట్టగుంట నరేశ్‌లు తెలంగాణ మద్యం బాటిళ్లను అక్రమంగా విక్రయిస్తున్నట్టు సమాచారం రావడంతో సెబ్ అధికారులు ఆకస్మికంగా దాడి చేశారు. శివకుమారి నుంచి 46, నరేశ్ నుంచి 206 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. సమావేశంలో సెబ్ ఈఎస్ రంగారెడ్డి, సీఐ లక్ష్మీప్రసన్న, ఎస్ఐ పీ రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పాపురం ఛానల్ గండ్లు పూడ్చివేత

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 14: భారీ వరదల కారణంగా అప్పాపురం ఛానల్ కు పడిన గండ్లు పూడ్చివేత పనులు రెండు రోజులుగా సాగుతున్నాయి. ఇటీ వల కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చేబ్రోలు మండల పరిధిలోని కోవెలమూడి, ముట్లూరు, వట్టిచెరుకూరు పరిధిలో గండ్లు, వరద లను స్వయంగా పరిశీలించిన మీదట పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమర్ ఆదేశాలతో అప్పాపురం ఛానల్ అధికారులు రెడ్డిపాలెం నీటి సంఘం మాజీ అధ్యక్షుడు వీరిశెట్టి సాంబశివరావు ద్వారా రెండు భారీ యంత్రాల ద్వారా గండ్లు పూడ్చడం, కాలవ కట్టలు బలం చేస్తున్నారు. వీరిశెట్టి సాంబశివరావుతో పాటు ఏఈ కిషోర్, వలి దగ్గర ఉండి పనులను పర్యవేక్షిస్తున్నారు. జాగర్లమూడి లాకుల నుంచి వట్టిచెరుకూరు ఎస్సీ కాలనీ వరకు రెండు రోజుల్లోనే గండ్లు పూడ్చటం పూర్తి చేస్తామన్నారు.

బాలలందరూ నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలి

ఫిరంగిపురం, సెప్టెంబరు 14: 19 సంవత్సరాల వయస్సు ఉన్న బాలలందరూ నులి పురుగుల నివారణ మాత్రలను తప్పనిసరిగా వేసుకోవాలని ఈవోపీఆర్‌డీ నిర్మల లక్ష్మీకుమారి అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో పాఠశాలల హెచ్ఎంలు, ఆరోగ్య సిబ్బందికి నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఈనెల 17వ తేదీన నిర్వహించే జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 188 కేసులు పరిష్కారం

మంగళగిరి, సెప్టెంబరు 14: మంగళగిరి కోర్టుల పరిధిలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో శనివారం 188 కేసులు పరిష్కారమయ్యాయి. ఓఎస్‌లు 10, ఈపీ 1, ఐపీసీ సీసీలు 138, చెక్కు బౌన్సు కేసులు 14, మనోవర్తి కేసులు 3, గృహ హింస కేసులు 3, పీఎల్‌సీలు 14, ఎస్‌టీసీలు 5 పరిష్కారమయ్యాయి. మంగళగిరి కోర్టులో మూడు బెంచ్‌లు ఏర్పాటు చేయగా మొదటి బెంచ్‌లో లోక్ అదాలత్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వై నాగరాజ, సభ్యులు టీ మధుసూదనరావు, 2వ బెంచ్‌లో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సీహెచ్‌వీ రామకృష్ణ, సభ్యులు దొడ్డక శ్రీనివాసరావు, 3వ బెంచ్‌లో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్ బాబు, సభ్యులు కె.బాజీ గంగాధరరావు, పాల్గొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు, నార్త్ డివిజన్ పరిధిలోని పోలీసుస్టేషన్ల అధికారులు, సిబ్బంది, ఎంఎల్ఎస్‌సీ, కోర్టు సిబ్బంది, బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

జాతీయ భావాలను పెంపొందించడానికి హిందీ దోహదం

● ఎంఈవో కెన్నడీ

కాకుమాను, సెప్టెంబరు 14: జాతీయ భావాలను పెంపొందించడానికి హిందీ ఎంతో దోహదం చేస్తుందని ఎంఈవో కేఎఫ్ కెన్నడీ అన్నారు. మండలపరిధిలోని కొండపాటూరు ఎంపీయుపీ పాఠశాలలో హిందీ దివాస్ కార్యక్రమం హెచ్ఎం శీలం అంకారావు ఆధ్వర్యంలో జరిగింది. పాఠశాలలో భారతమాత, వంటి అలంకరణలో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రదర్శనలు ఆహుతులను ఆకర్షించాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంఈవో మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో దేశాన్ని ఏకతాటికి తీసుకువచ్చిన హిందీని విద్యార్థులు ఆవశ్యకతను గుర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రకాశరావు, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



విద్యార్థులకు మొక్కలు అందజేస్తున్న ఇంటెల్ హైస్కూలు ప్రిన్సిపాల్ అశోకరాణి తదితరులు

మేడికొండూరు, సెప్టెంబరు 14: విద్యార్థులు తమ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ కనీసం ఒక్కో మొక్కను నాటి వాటిని సంరక్షించాలని మండలంలోని పేరేచర్ల ఇంటెల్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కోనూరి అశోక రాణి చెప్పారు. శనివారం స్కూల్లో మొక్కల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మేడికొండూరు ఎంపీడీవో ప్రభాకర్, ఈవోపీఆర్‌డి రవి కుమార్, గుంటూరు రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ పోతురాజు, మండల ఎంఈవో అబ్దుల్ సలీం తదితరులు హాజరై హైస్కూల్లోని 2,500 మంది విద్యార్థులకు మొక్కలు అందజేశారు. ఈ మొక్కలను ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఒకే రోజు నాటడం జరుగుతుందని ఫారెస్ట్ రేంజ్ అధికారి పోతురాజు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు, అధ్యాపకులకు, నాన్ టీచింగ్ స్టాఫ్ అందరికీ మొక్కల్ని అందించడం జరిగింది. మొక్కల పంపిణీలో పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు సుకన్య, పిడి షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

తెనాలి వార్తలు



వార్షికోత్సవంలో పాల్గొన్న అసోసియేషన్ ప్రతినిధులు

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

● పద్మశాలీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవంలో మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ

తెనాలిఅర్బన్, సెప్టెంబరు14: ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ ఉద్యోగులకు సూచించారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో శనివారం పద్మశాలీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ తృతీయ వార్షికోత్సవాన్ని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జీవీఎస్ రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏఎస్ రామకృష్ణ ఆయన మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతికరంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా చేనేత రంగంలోని వృత్తి నైపుణ్యకారులు సాంకేతికతను అన్వయించుకోవాలన్నారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. పద్మశాలీ సంఘం రాష్ట్ర కన్వీనర్ జీవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ సమాజానికి వస్త్రాన్ని అందించి నాగరికత నేర్పిన చేనేతల జీవన స్థితిగతులు మెరుగు పరిచేందుకు కృషి చేస్తామన్నారు. తమిళనాడు హ్యాండ్‌లూమ్స్ ఎండీ క్షౌరశి చేనేత పరిశ్రమలో నూతన ఆవిష్కరణలు ఇంజనీరింగ్ సాంకేతిక పరిజ్ఞానంతోవచ్చిన పరికరాలు, నూలు తయారీ విధానాన్ని వివరించారు. ఆప్కో మాజీ చైర్మన్ చిరంజీవి, సంఘ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, చంద్రశేఖర్‌లు ప్రసంగించారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించారు. గత ఏడాది పదవీ విరమణ, పదోన్నతి, అవార్డులు పొందిన సంఘ సభ్యులను ఘనంగా సన్మానించారు.



వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

21న మాదిగల ఆత్మీయ సమావేశం

తెనాలిరూరల్, సెప్టెంబరు 14: తెనాలి పట్టణంలో ఈ నెల 21న మాదిగల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ తెలిపారు. శనివారం పట్టణంలోని మార్కెట్‌మార్డు ప్రాంగణంలో కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఎమ్మార్పీఎస్ నేతలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. ఈ ఆత్మీయ సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పాల్గొననున్నారని, సంఘ సభ్యులందరూ సమావేశంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కూచిపూడి సత్యం మాదిగ, వేమూరి సుధీర్ మాదిగ, బోసుబాబు మాదిగ, ఆలపాటి కరుణాకర్ మాదిగ, లేచితమాదిగ, జ్యోతిమాదిగ, పులవర్తి లక్ష్మయ్య, మేకలసురేష్, అనీల్‌కుమార్, మురళి, తదితరులు పాల్గొన్నారు.



సీతారాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సీతారాం చిత్రపటానికి అంగన్‌వాడీల నివాళి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 14 : సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి చిత్రపటానికి అంగన్‌వాడీ వర్కర్లు నివాళులర్పించారు. శనివారం చెంచుపేట ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో సీపీఎం జిల్లా నేత బాబుప్రసాద్ మాట్లాడుతూ మహిళా కార్మికుల సమస్యలపై సీతారం ఏచూరి పోరాడి, వారిహక్కుల సాధనకు కృషిచేశారని తెలిపారు. మహిళా సాధికారత సాధించేందుకు మహిళలలో ఆత్మవిశ్వాసం నింపారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తల జిల్లా నాయకురాలు కుమారి, హుస్సేన్‌వలి, అశోక్, హసీనాబేగం, లావణ్య, రాధిక పాల్గొన్నారు.



పశుగ్రాసాన్ని తరలిస్తున్న లారీని ప్రారంభిస్తున్న డీఎస్పీ జనార్ధనరావు, సమితి సభ్యులు

శ్రీశైల భక్తసేవా సమితి సేవలు అభినందనీయం

● తెనాలి డీఎస్పీ జనార్ధనరావు

తెనాలి రూరల్, సెప్టెంబరు 14: వరద ముంపు గ్రామాల్లోని పాడిరైతులకు అండగా నిలుస్తూ పశువులకు గ్రాసాన్ని సమకూర్చిన శ్రీశైలభక్తసేవా సమితి సభ్యుల సేవలు అభినందనీయమని డీఎస్పీ జనార్ధనరావు అన్నారు. ఇటీవలకురిసిన భారీవర్షాలకు వరదముంపుకు గురైన లంకగ్రామాలకు శ్రీశైలభక్తసేవాసమితి సహకారంతో 20 టన్నుల దాణా సమకూర్చి శనివారం వాటిని తెనాలి నుంచి ఆయా ప్రాంతాలకు తరలించి పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా డీఎస్పీ జనార్ధనరావు పాల్గొని ఆ గ్రాసాన్ని తరలించే లారీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వరద ముంపు ప్రాంతాల్లో పశువుల కోసం శ్రీశైలభక్త సేవా సమితి సభ్యులు పెద్దమనస్సు చాటుతూ 400 మంది పాడి రైతులకు ఒక్కొక్కరికి 25 కేజీల మినప పొట్టు, 25 కేజీల కామధేను మిక్సర్, 2 కేజీల బెల్లం తదితర గ్రాసాన్ని సమకూర్చి అందజేస్తున్నారన్నారు. వరద ముంపు సమయంలో 10000 మందికి ఆహారాన్ని అందించి వారి ఆకలితీర్చి మానవతా విలువలను కాపాడారన్నారు. ఇప్పుడు పాడిరైతులకు అండగా నిలబడేందుకు ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. రానున్న రోజుల్లోనూ సేవా సమితి సేవలను మరింతగా ముందుకు తీసుకుపోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు ఆళ్ళ వెంకటసుబ్బయ్య, పరిమి గోవర్ధర్, రోన గ్రహ్మానందగుప్త, కె. వెంకటరవీంద్ర, తుమ్మల రామకృష్ణ, నక్కా వేణుగోపాల్, బి.భాస్కరరావు, భారతి పలువురు సభ్యులు పాల్గొన్నారు.



వరద బాధితులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న కత్తెర సురేష్

వరద బాధితులకు అండగా హార్వెస్ట్ ఇండియా

● సంస్థ అధినేత కత్తెర సురేష్

కొల్లిపర, సెప్టెంబరు 14 : వరద బాధితులను ఆదుకోవడంలో హార్వెస్ట్ ఇండియా సంస్థ ఎల్లప్పుడు ముందంజలో ఉంటుందని హార్వెస్ట్ ఇండియా అధినేత, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కత్తెర సురేష్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కొత్తూరులంక, మునగపల్లిలంక గ్రామాల్లో 500 మంది వరద బాధిత కుటుంబాలకు హార్వెస్ట్ ఇండియా అధినేత కత్తెర సురేష్‌కుమార్, స్థానిక నాయకులతో కలిసి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే అనేక లంక గ్రామాల్లో నిత్యావసర సరుకులు, కూరగాయలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో న్యాయవాది బుల్ల రవికుమార్, నాయకులు అరవపల్లి అప్పయ్య, మునపల్లి వెంకట్రావు, రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 214 కేసుల పరిష్కారం

● 11వ అదనపు జిల్లా న్యాయాధికారి డీ.శ్రీనివాసులు

తెనాలి క్రైం, సెప్టెంబరు 14 : కోర్టు ప్రాంగణంలో జరిగిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా 215 కేసులు పరిష్కారం అయినట్లు 11వ అదనపు జిల్లా న్యాయాధికారి డి.శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఇందులో సివిల్ కేసులు 57, క్రిమినల్ కేసులు 144, ప్రీలిటిగేషన్ కేసులు 14 ఉన్నాయి. రూ.3.58 కోట్ల మేర పరిష్కారం మొత్తం అందించడం జరిగిందన్నారు. ఈ లోక్ అదాలత్‌లో కేసు పరిష్కారం కోసం నాలుగు బెంచీలు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్, లోక్ అదాలత్ మెంబర్లుగా ఎన్‌వీ మహేశ్వరరావు, సోలా శంకర్, శారద, జి.వెంకయ్యలు వ్యవహరించారు. కార్యక్రమంలో



కేసులు పరిష్కరిస్తున్న 11వ అదనపు జిల్లా న్యాయాధికారి డీ.శ్రీనివాసులు



జడ్జి అంజనీ ప్రియదర్శిని సమక్షంలో కేసులు విచారిస్తున్న న్యాయవాదులు

బార్ అసోసియేషన్ అధ్యక్షులు బేతాళ ప్రభాకర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పొన్నూరు పట్టణంలో ..

పొన్నూరుటౌన్ : స్థానిక ఎడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 89 కేసులు పరిష్కారమైయ్యాయి. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎం అంజనీ ప్రియదర్శిని అధ్యక్షతన నిర్వహించిన ఈ అదాలత్ లో 11 సివిల్, 55 క్రిమినల్, 2 మనోవర్తి, 5 బ్యాంకు సంబంధిత కేసులు, 16 ప్రీ లిటికెంట్ కేసులు పరిష్కరమయ్యాయి. ఈ మొత్తం కేసుల్లో రూ. 21.65 లక్షల నగదుకు సబంధించిన పరిష్కారాలు చూపినట్లు జడ్జి అంజనీ ప్రియదర్శిని తెలిపారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు మొగ్బల్ బేగ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీ.జయరాజ్, న్యాయవాదులు కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

తెనాలిరూరల్, సెప్టెంబరు 14: మండలంలోని నందివెలుగు కాలువలో గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. నందివెలుగు - తెనాలి ప్రధాన రహదారి వెంట ఉన్న కాలువలో గుర్తుపట్టని విధంగా ఉబ్బివున్న వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. ఇటీవల వర్షాలకు వరదనీరు ఉధృతికి మృతదేహం కొట్టుకువచ్చి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తెలిపారు.



డెంగీ వ్యాధిపై అవగాహన కరపత్రాలు పంపిణీ చేస్తున్న మలేరియా అధికారులు

డెంగీతో అప్రమత్తంగా ఉండాలి

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 9: పట్టణ ప్రజలు డెంగీ వ్యాధి నుంచి అప్రమత్తంగా ఉండాలని పట్టణసబ్‌యూనిట్ అధికారి ఉమాకాంత్ అన్నారు. స్థానిక చినరావూరులో మలేరిమా అధికారులు శనివారం డెంగీ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమాకాంత్ మాట్లాడుతూ డెంగీ వ్యాధి దోమల నుంచి వ్యాపిస్తాయని, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, పరిసరాల పరిశుభ్రతను తప్పని సరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



హిందీ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు

చవితి మండపంలో అన్నదానం

పొన్నూరుటౌన్, సెప్టెంబరు14: పొన్నూరు పట్టణంలోని నేతాజీ నగర్‌లో ఏర్పాటు చేసిన గణేషుని మండపంలో శనివారం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. వేజండ్ల హనుమంతరావు ఆధ్వర్యంలో చవితి మండపంలో ప్రత్యేక పూజలు చేసి అయోధ్య బాల రాముడి అలంకారణలో ఉన్న గణనాథుడికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేసారు. అలాగే అన్సార్ థియేటర్ చవితి మడపం, నిడుబ్రోలు రైలు పేటలో చవితి మండపాలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



హిందీ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

హిందీ భాషతో ఉపాధి అవకాశాలు

పొన్నూరుటౌన్,సెప్టెంబరు14: హిందీ భాష నేర్చుకోవటం ద్వారా దేశవ్యాప్తంగా మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని పీబీఎస్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని పీబీఎస్ కళాశాలలో శనివారం జాతీయ హిందీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా హిందీ భాష ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. 1953 సెప్టెంబరు 14 నుంచి జాతీయ హిందీ దినోత్సవం అమలులోకి వచ్చిందన్నారు. అనంతరం విద్యార్థులకు హిందీలో వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేసారు. కార్యక్రమంలో కళాశాల హిందీ విభాగాధిపతి జే. రూయదాస్, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కే.చితరంజన్, జీ. సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ హరిత

సీపీఆర్‌పై అవగాహన అవసరం

● సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పీఎన్ఎస్ హరిత

● వీవీఐటీలో ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం

పెదకాకాని, సెప్టెంబరు 14: గుండె సంబంధిత వ్యాధులు, సీపీఆర్ (కార్డియోపల్మనరీ రిససిటేషన్)పై అవగాహన కలిగి ఉండాలనీ ఆస్టర్ రమేష్ హాస్పిటల్ సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పీఎన్ఎస్ హరిత తెలిపారు. శని వారం వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం సందర్భంగా 'యంగ్ లైఫ్ సేవర్స్' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా డాక్టర్ హరిత విచ్చేసి విద్యార్థులు, ఆధ్యాపకులకు గుండె సంభందిత వ్యాధులు, సీపీఆర్ విధానంపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిత మాట్లడుతూ గుండె పోటుకి గురైన ప్రతి 100 మందిలో 70 మందిని సీపీఆర్ చికిత్స ద్వారా కాపాడే అవకాశం ఉందన్నారు. శ్వాస తీసుకోవడం ఆగిపోయినా, గుండె కొట్టుకోవడం ఆగిపోయినా సీపీఆర్ ద్వారా వారి ప్రాణాలను కాపాడ వచ్చని అన్నారు. కార్యక్రమంలో వీవీఐటీ ప్రిన్సిపాల్ వై.మల్లికార్జునరెడ్డి. ఎన్ఎస్ఎస్ అధికారి భక్తసింగ్, ఎన్‌సీఈ అధికారులు బిబెన్‌బాషా, ఆళ్ల శ్రీవాణి, విద్యార్థులు, ఆధ్యాపకులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి ఎమ్మెల్యే నివాళి

పొన్నూరుటౌన్, సెప్టెంబరు14 : మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో టీడీపీ కార్యకర్త కావేటి కొండయ్య శనివారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆ గ్రామానికి విచ్చేసి కొండయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కొండయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు నలూరి సాంబశివరావు, స్థానిక టీడీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.



చెత్త తరలింపు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

డంపింగ్ యార్డులోని చెత్త తరలింపు

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 9: మున్సిపల్ డంపింగ్ యార్డులోని చెత్తను జిందాల్ పవర్ ప్లాంట్ గుంటూరుకు మున్సిపల్ అధికారులు తరలించారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శనివారం మున్సిపల్ డంపింగ్ యార్డులోని చెత్తను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పర్యవేక్షణలో లారీలో గుంటూరులోని జిందాల్ పవర్ ప్లాంటుకు తరలించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, శానిటరీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యకు పేదరికం భారం కాకూడదు

తెనాలి రూరల్, సెప్టెంబరు 14: పేదరికం విద్యకు భారం కాకూడదని నిరుపేదవిద్యార్థులకు ఆర్థిక సాయం అందించి వారికి అండగా నిలుస్తున్న కొత్తపల్లి బుజ్జి సేవలు అభినందనీయమని టీడీపీ సీనియర్ నాయకులు కొత్తరమేష్‌బాబు అన్నారు. శనివారం మండలంలోని సంగంజాగర్లమూడిలో కొత్తపల్లి సుబ్బారావు, లక్ష్మిల చేతల మీదుగా కుమారుడు బుజ్జి(ఎన్నారై) సహకారంతో 20 మంది నిరుపేద విద్యార్థులకు రూ.5వేలు వంతున రూ.లక్ష పంపిణీ చేశారు. పలువురు గ్రామపెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎరక్కపోయి.. ఇరుక్కుపోయి !

● రైల్వే వంతెన గడ్డర్‌లో ఇరుక్కున లారీ

● గ్యాస్ కట్టర్‌తో కమ్మీలు తొలగించి విడిపించిన అధికారులు

తెనాలి రూరల్, సెప్టెంబరు 14: పట్టణంలోని వైకుంఠపురం రైల్వే వంతెన కింద కొంద ముందు దూరంలో ఏర్పాటు చేసిన ఇనుప గడ్డర్ కింద ఓ లారీ ఇరుక్కు పోయిన ఘటన శనివారం చోటుచేసుకుంది. తెనాలి- చందోలు ప్రధాన రహదారికి అడ్డండి వైకుంఠపురం ఆలయం సమీపంలో ఉన్న రైల్వేలైన్‌కు హెవీ వాహనాలు



ఇనుప గడ్డర్ కింద ఇరుక్కుపోయిన లారీ...



రైల్వే గడ్డర్‌ను తొలగిస్తున్న సిబ్బంది

ప్రవేశించకుండా రక్షణగా ఏర్పాటు చేసిన ఇసుప గడ్డర్‌లను పాల లారీ దాటే ప్రయత్నం చేసింది. దీంతో పాల లారి క్యాబిన్ గడ్డర్‌లలో ఇరుక్కుపోవడంతో లారీడ్రైవర్ అప్రమత్తమై వాహనాన్ని నిలుపుదల చేశాడు. లేకుంటే ఎదురుగా ఉన్న రైల్వే లైన్ వంతెన ను ఢీకొట్టి పెద్ద ప్రమాదం జరిగి ఉండేది. విషయం తెలుసుకున్న స్థానిక రైల్వే అధికారులు గుంటూరు నుంచి రైల్వే సిబ్బందిని పిలిపించి గడ్డర్‌ను గ్యాస్ కట్టర్‌తో తొలగించి లారీని వెనక్కుపంపారు. అనంతరం యథాతథంగా ఇనుపగడ్డర్‌లను ఏర్పాటు చేశారు. రైల్వే నిబంధనలను ఎవ్వరు అతిక్రమించినా చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఈ సందర్భంగా రైల్వే అధికారులు హెచ్చరించారు.

17న ఉపాధ్యాయుల పురస్కారాల ప్రదానం

చేబ్రోలు, సెప్టెంబరు 14 : లగడపాటి సీతారామయ్య ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను ఈ నెల 17న ప్రదానం చేయనునట్లు ఆ సంస్థ నిర్వాహకులు లగడపాటీ వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు. పాఠశాలలు, కళాశాలలకు చెందిన 16 మంది ఉపాధ్యాయులకు ఈ పురస్కారం చేయనున్నట్లు వేణుగోపాల్ తెలియ జేసారు.



మినిలారీలో తరలిస్తున్న బియ్యం బస్తాలు

పోలీసు అదుపులో బియ్యం తరలిస్తున్న వ్యక్తి

తెనాలి క్రైం, సెప్టెంబరు 14: అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు వన్ టౌన్ సీఐ వీ.మల్లికార్జునరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక గురవయ్య కాలనీ వద్ద శనివారం ఉదయం 10 గంటల సమయంలో బియ్యం పంపిణీ చేసే వాహనంనుంచి మరో మిని లారీలోకి బియ్యం బస్తాలు చేర్చుతున్నారని సమాచారం వచ్చిందన్నారు. వెంటనే ఆ లారీ వద్దకు వెళ్లి బియ్యం తరలింపు చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసకున్నట్లు తెలిపారు. 58 బస్తాలలో నిల్వ ఉంచి 2900 కిలోల బియ్యాన్ని రెండు మినీ లారీలను, లారీ డ్రైవరు ప్రసాదం వెంకట కిషోర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచామని సీఐ మల్లికార్జునరావు తెలిపారు.



అంతర పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, సలహాదారుడు మాల కొండయ్య

సేంద్రియ వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడి

● విజ్ఞాన్ యూనివర్సిటీ సలహాదారుడు డాక్టర్ మాల కొండయ్య

కొల్లిపర, సెప్టెంబరు 14 : రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతి ద్వారా పంటలు పండిస్తే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని మాజీ డీజీపీ, విజ్ఞాన్ యూనివర్సిటీ సలహాదారుడు డాక్టర్ మాల కొండయ్య అన్నారు. శనివారం మండల కేంద్రం కొల్లిపరలో విజ్ఞాన్ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్స్ కె. హరిషా, కనపాల శ్రావ్య, శాస్త్రవేత్త టి. డాక్టర్ రమేష్‌బాబు, విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థులతో కలిసి ఆయన పసుపులో అంతర పంటలను, అరటి, కందలను పరిశీలించి రైతులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ మాల కొండయ్య మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించుకోవడం మంచిదన్నారు. కార్యక్రమంలో రైతులు రైతులు నెర్ల కుటుంబరెడ్డి, బొంతు కోటిరెడ్డి, వుయ్యూరు సాంబిరెడ్డి, నెర్ల విజేంద్రరెడ్డి, వుయ్యూరు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంగంజాగర్లమూడిలో చవితి ఉత్సవాల్లో విఘ్నేశ్వరునితో కమిటీ సభ్యులు

వైభవంగా వినాయక చవితి వేడుకలు

తెనాలి రూరల్, సెప్టెంబరు 14: మండలంలోని సంగంజాగర్లమూడిలో రామాలయం ఆవరణలో శ్రీరామ గణేష్‌యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం స్వామి వారి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. పరిసర ప్రాంత గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్సవాల్లో ఆదివారం చివరి రోజు స్వామి వారి నిమజ్జన కార్యక్రమం జరుగుతుందని, భక్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.



పూజల్లో పాల్గొన్న నిర్వహణ కమిటీ సభ్యులు

గురవయ్య కాలనీలో ..

తెనాలి అర్బన్ : పట్టణంలోని రామలింగేశ్వరపేట గురవయ్య కాలనీలో గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గత 16 ఏళ్లుగా జరుగుతున్న ఉత్సవాలలో భాగంగా ఈ ఏడాది భారీ ఎత్తున నవరాత్రులు నిర్వహించారు. మెట్టపల్లి గోపాలకృష్ణ సహకారంతో శనివారం 4 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆదివారం లడ్డూ వేలం పాట నిర్వహించి వైభవంగా ఊరేగించి తూర్పు కాల్వలో నిమజ్జనం చేశామని నిర్వాహకులు తెలిపారు. హరిదాసు గౌరీశంకర్, సుబ్రహ్మణ్యం, రవికాంత్, హరీష్, బన్ను, అన్వేష్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు అడపా సంపత్‌రాయుడు పాల్గొన్నారు.

అమ్మ చారిటబుల్ ట్రస్టు సేవలు స్ఫూర్తిదాయకం

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 9: పేదల కోసం అమ్మ చారిటబుల్ ట్రస్టు సభ్యుల సేవలు స్ఫూర్తిదాయకమని డీఎస్పీ జనార్ధనరావు అన్నారు. స్థానిక చెంచుపేటలోని జిల్లా వైద్యశాలలో శనివారం హెచ్ఐవీ వ్యాధితో బాధపడుతున్న 50 మంది చిన్నారులకు ట్రస్టు సభ్యులు న్యూట్రీషన్ ఫుడ్‌ను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా డీఎస్పీ జనార్ధనరావు, కుమార్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత కొత్తసుబ్రహ్మణ్యంలు పాల్గొని హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహార కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ది ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ ముమ్మానేని భానుమతి, అమ్మ చారిటబుల్ ట్రస్టు సభ్యులు, అన్నదాత సుఖీభవ మిత్ర బృందం పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 14: ప్రజా వ్యతిరేక విధాలను అవలంభిస్తున్న ప్రధాని మోదీపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక శారదా కాలనీలో అమర వీరుల మామిళ్ళపల్లి మాల కొండయ్య, గుర్రం బ్రహ్మయ్య సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ మోదీ పాలనలో దేశంలో పేద ప్రజలు మరింత పేదలవుతుంటే, ధనవంతులు మరింత ధనికులవుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు కోటా మాల్యాద్రి, ఆకిటి అరుణ్ కుమార్, నూతలపాటి చిన్న దండు రవి, మంగా శ్రీనివాసరావు, అంజిబాబు పాల్గొన్నారు.